ఒడిషా సిఎంగా... మోహన్ చరణ మాఝి ప్రమాణం

హాజరైన ప్రధాని మోడీ కేంద్ర మంత్రులు

02

కలం నిఘా
WWW.KALAMNIGHA.COM
తెలుగు దినపత్రిక
హైదరాబాద్ : గురువారం, 13 జూన్ 2024
సంపుటి: 14, సంచిక: 69, పేజీలు 8, వెల: 4.00
Published from : Hyderabad, Karimnagar, Nizamabad, Warangal, Vijayawada, Tirupati, Kurnool, Visakhapatnam

టెట్ ఫలితాలు విడుదల చేసిన రేవంత్ రెడ్డి

02

తెలంగాణ
టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్
(TET)
ఫలితాలు విడుదల
2024

ముఖ్యమంత్రిగా చంద్రబాబు... నేడు తొలి సంతకం



ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రెండో సంతకం, పింఛను రూ.4వేలకు పెంచుతూ మూడో సంతకం, స్కిల్ సైన్సెస్‌పై నాలుగో సంతకం, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై ఐదో సంతకం చేయనున్నారు

నేటి సాయంత్రం బాధ్యతలు స్వీకరించనున్న చంద్రబాబు

సచివాలయంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

కొత్తమంత్రులతో ఉండవల్లి నివాసంలో చర్చలు

గత ప్రభుత్వ అక్రమాలపై శ్వేతపత్రం విడుదల చేసే యోచన

అమరావతి జూన్ 12(నిఘా న్యూస్): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన చంద్రబాబు గురువారం సాయంత్రం 4.41 గంటలకు బాధ్యతలు స్వీకరించనున్నారు. సచివాలయంలోని మొదటి బ్లాక్‌లో అధికారులు ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హావిరీ మేరకు మెగా డీఎస్సీపై తొలి సంతకం, ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై రెండో సంతకం, పింఛను రూ. 4వేలకు పెంచుతూ మూడో సంతకం *మిగతా2లో..*

ఏపీలో ఉదయించిన చంద్రం

సిఎంగా చంద్రబాబు ప్రమాణం

కొలువుదీరిన కొత్త ప్రభుత్వం

పవన్ కళ్యాణ్, లోకేశ్ తదితరుల ప్రమాణం

ప్రమాణం చేయించిన గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్

హాజరైన ప్రధాని మోడీ,అమిత్ షా, చిరంజీవి రజనీకాంత్ తదితరులు

విజయవాడ జూన్ 12(నిఘా న్యూస్): ఆంధ్రప్రదేశ్‌లో కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. గత ఎన్నికల్లో అతిపెద్ద విజయం సాధించిన కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. నూతన ముఖ్యమంత్రిగా తెదేపా అధినేత చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేశారు. కృష్ణా జిల్లా కేసరపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ చంద్రబాబుతో ముఖ్య మంత్రిగా ప్రమాణం *మిగతా2లో..*

కాళేశ్వరంపై ఆధారాలు కోరిన కమిషన్

నిర్మాణం, డిజైన్, మెయిటెనెన్స్‌పై అఫిడవిట్ దాఖలు చేయండి

తరువాత అసలు కారకులను గుర్తిస్తాం

ఏజెన్సీలను ఆదేశించిన జస్టిస్ చంద్ర ఘోష్

హైదరాబాద్ జూన్ 12(నిఘా న్యూస్): కాళేశ్వరం ప్రాజెక్టులోని బ్యారేజీల నిర్మాణంపై విచారణ ప్రక్రియ కొనసాగు తోంది. ప్రాజెక్ట్‌లో జరిగిన అవకతవకలపై జస్టిస్ చంద్ర ఘోష్ కమిటీ విచారణ కొనసాగుతున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటికే ప్రాజెక్టును సందర్శించిన కమిటీ ఇప్పుడు విచారణను వేగవంతం చేసింది. ఈనేపథ్యంలో కాళేశ్వరం కమిషన్ చీఫ్ జస్టిస్ మిగతా2లో..

ఆలయ రాజకీయాలను ఓడించిన ప్రజలు

ఓట్ల కోసమే రామ మందిర నిర్మాణం

చంద్రబాబు నితీష్ కుమార్ మద్దతుతో ఏర్పడిన బిజెపి ప్రభుత్వం

శరద్ పవార్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ జూన్ 12(నిఘా న్యూస్): ఓట్ల కోసమే బీజేపీ ప్రభుత్వం రామమరందిరం నిర్మాణం చేస్తే అయోధ్య ప్రజలు మతపరమైన రాజకీయాలకు ప్రోత్సాహం ఇవ్వమని చెప్పకనే చెప్పారని ఎన్సీపీ(ఎస్పీ) చీఫ్ శరద్ పవార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. పూణే జిల్లాలోని బారామతిలో శరద్ పవార్ మాట్లాడారు. ఆలయ రాజకీయాలను ఎలా సరిదిద్దగలరో అయోధ్య ప్రజలు చేతల్లో చూపించారని, బీజేపీని ఓడించి ఆలయ రాజకీయాలను సరిచేశారని వ్యాఖ్యానించారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లో అయోధ్య ఆలయం ఉండే ఫైజాబాద్ పార్లమెంట్ స్థానంలో బీజేపీ అభ్యర్థి ఓటమి చెందిన విషయం తెలిసిందే. 2019 ఎన్నికల్లో *మిగతా2లో..*

నేడు మోడీ తొలి విదేశీ పర్యటన

ఇటలీ జి7 సదస్సులో పాల్గొననున్న ప్రధాని

న్యూఢిల్లీ జూన్ 12(నిఘా న్యూస్): మూడోసారి ప్రధానిగా బాధ్యతలు స్వీకరించాక మోదీ తొలి విదేశీ పర్యటన ఖరారైంది. జీ 7 శిఖరాగ్ర సమావేశంలో పాల్గొనడానికి గురువారం ప్రధాని మోదీ ఇటలీ వెళ్లనున్నారు . జూన్ 13 నుంచి 15వరకు ఇటలీలోని అపులియా ప్రాంతంలోని జి7 సదస్సు *మిగతా2లో..*

హమాస్, ఇజ్రాయెల్... కాల్పుల విరమణకు ఐక్య రాజ్య సమితి ఆమోదం

ఇది దేశాలు పాటించాలని ఆదేశం

న్యూఢిల్లీ జూన్ 12(నిఘా న్యూస్): హమాస్, ఇజ్రాయెల్ మధ్య గత ఎనిమిది నెలలుగా భీకర యుద్ధం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ పోరుకు ముగింపు పలకాలన్న ఉద్దేశంతో తెరపైకి తీసుకొచ్చిన కాల్పుల విరమణ ప్రణాళికకు ఐక్య రాజ్య సమితి భద్రతా మండలి సోమవారం ఆమోదం తెలిపింది. అమెరికా *మిగతా2లో..*

బ్రిటన్ ఎన్నికల్లో హిందువుల డిమాండ్లు

మేనిఫెస్టో విడుదల చేసిన హిందుస్ ఫర్ డెమోక్రసీ

డిమాండ్లను ఒప్పుకున్న వారికే ఓటు వేస్తామని ప్రకటన



న్యూఢిల్లీ జూన్ 12(నిఘా న్యూస్): జూలై 4న బ్రిటన్‌లో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. దీంతో అక్కడున్న బ్రిటన్ హిందువులు భవిష్యత్తు ప్రభుత్వం కోసం తమ డిమాండ్లకు సంబంధించి మేనిఫెస్టోను విడుదల చేశారు. 32 పేజీల మేనిఫెస్టోను విడుదల చేయడం ఇదే మొదటి సారి. ఈ డిమాండ్లకు ఒప్పుకున్న వారికే ఓటు వేస్తామని వారు స్పష్టం చేశారు. ముసాయిదా మేనిఫెస్టోను మిగతా2లో..

కువైట్ అగ్ని ప్రమాదంలో 43 మంది మృతి

మృతుల కుటుంబాలకు మోడీ సంతాపం



కువైట్ జూన్ 12(నిఘా న్యూస్): కువైట్ లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఓ భవనంలో మంటలు చెలరేగడంతో 43 మంది సజీవ దహనమయ్యారు. మతుల్లో 10 మంది మరణించగా వారిలో ఐదుగురు భారతీయులు ఉండగా వారంతా మిగతా2లో..

గ్రూపులు కడితే తోకలు కత్తిరిస్తా

పనిలో పోటీ పడుదాం : ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్ ఘనపూర్ జూన్ 12(నిఘా న్యూస్): మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధ్యక్షతన స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. వరంగల్ పార్లమెంట్ ఎన్నికలలో భారీ మెజారిటీతో విజయం సాధించిన మిగతా2లో..

లైంగిక వేధింపుల కేసులో యడ్యూరప్పకు నోటీసులు

కర్ణాటక జూన్ 12(నిఘా న్యూస్): మైనర్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే అభియోగాలపై కర్ణాటక మాజీ సీఎం, బీజేపీ నేత యడియూరప్పకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. పోక్సో (లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ) కేసుకు సంబంధించి విచారణకు హాజరుకావాలని మిగతా2లో..

ఆలయ రాజకీయాలను ఓడించిన ప్రజలు

(మొదటిపేజీ తరువాయి)

300 కంటే ఎక్కువ సీట్లు గెలిచిన బీజేపీ ఇటీవల జరిగిన ఎన్నికల్లో 240 సీట్లకు పడిపోయిందని పవార్ అన్నారు. ఈ ఎన్నికల్లో బీజేపీకి 60 సీట్లు తగ్గాయని, ఇది చాలా తక్కువ మెజార్టీ అని చెప్పారు. ఈ సీట్ల తగ్గుదలలో ఉత్తరప్రదేశ్ కీలక రాష్ట్రంగా మారిందని, ఇక్కడి ప్రజలు విలక్షణమైన తీర్పు ఇచ్చారి పవార్ వ్యాఖ్యానించారు. దేశ ప్రజలు తెలివైన వారని, ఆలయం పేరిట ఓట్లు అడుగుతున్నారని గ్రహించి వైఖరి మార్చుకున్నారని తెలిపారు. ఫలితంగా బీజేపీ ఓటమి చెందిందన్నారు. ఓట్లు అడిగేందుకు రామ మందిరమే ఎన్నికల అజెండాగా అయోధ్య ఆలయాన్ని ఉపయోగించడాన్ని చూసి తాము భయపడ్డామని పేర్కొన్నారు. కానీ ప్రజలు రాజకీయాలనుచ మత విశ్వాసాలను కలిపి చూడరని ముందే ఉహించానన్నారు. అందుకే ప్రజలు అనుకున్న దానికంటే భిన్నమైన తీర్పు ఇచ్చారన్నారు. దీంతో ఫైజాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి లల్లూ సింగ్ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. దేశంలో ప్రజాస్వామ్యం చెక్కు చెదరకుండా ఉందని, దానిని అంతం చేయడం రాజకీయాలతో సాధ్యం కాదని ఆయన వ్యాఖ్యానించాడు.పదేళ్లుగా బీజేపీ అధికారంలో ఉండి నచ్చిన విధంగా మార్పులు చేర్పులు చేశారని, దీంతో ప్రజలు ఆ పార్టీ నాయకులను తిరిగి నేల మీదకు తెచ్చారని పవార్ విమర్శలు చేశారు. అయితే మోదీజీ, సొంత మెజార్టీ ఎక్కడ అని ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుంది సొంతంగా సాధించిన మెజార్టీతో కాదని, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, జేడీయూ అధినేత నితీష్ కుమార్ సహాయంతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారన్నారు. కూటమితో ప్రభుత్వం నడిచే సమయంలో అందరి ఆలోచనలకు అనుగుణంగా పాలన చేపట్టాలన్నారు. అయితే ఇక నుంచి మోదీ సొంత నిర్ణయాలు తీసుకోవడానికి అవకాశం ఉండదని ఎద్దేవా చేశారు.

కాళేశ్వరంపై ఆధారాలు కోరిన కమిషన్



(మొదటిపేజీ తరువాయి)

చంద్ర ఘోష్ మాట్లాడుతూ ఈరోజు ఏజెన్సీలతో సమావేశం అయ్యాము. వాళ్లను అఫిడవిట్ ఫైల్ చేయమని చెప్పానని, గ్రౌండ్ రిపోర్ట్ తెలుసుకోవాలని అఫిడవిట్ ఫైల్ చేయమన్నాని ఆయన తెలిపారు. టైం బౌండ్ గురించి ఏజెన్సీలు అందరూ చెప్తున్నారు. ప్రభుత్వం విధించిన సమయంలో ప్రాజెక్టు అందించామని అన్నారని, ఎజెన్సీలను నిర్మాణం, డిజైన్, మెంటేనెన్స్ గురించి పూర్తిగా ఇవ్వాలని అదేశించానన్నారు జస్టిస్ చంద్ర ఘోష్.ఏది చెప్పినా, ఎవరూ కమిషన్ కు చెప్పినా ప్రతిదీ రికార్డు రూపంలో ఉండాలని, ఈ నెలాఖరులోపు అఫిడవిట్ రూపంలో సమాధానం ఇవ్వాలని అదేశించామని ఆయన తెలిపారు. ఎవరి ఆదేశాల మేరకు పనులు జరిగాయి అనేది రికార్డు రూపంలో సమాధానం వచ్చాక వాళ్లను కూడా పిలుస్తామని, సరైన ఆధారాల కోసమే అఫిడవిట్ దాఖలు చేయమని చెప్తున్నానని ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు వచ్చిన వాళ్ళతో అఫిడవిట్ వచ్చాక ఇతర వ్యక్తులను కూడా పిలుస్తానని, కొంతమంది అధికారులు స్టేట్ లో లేరు. వాళ్లను కూడా విచారణ చేస్తామన్నారు చంద్ర ఘోష్. విజిలెన్స్, కాగ్ రిపోర్టులు అందాయి.వాళ్లను కూడా విచారణ చేస్తామని, తప్పుడు అఫిడవిట్ ఫైల్ చేస్తే మాకు తెలిసి పోతుందన్నారు.

కువైట్ అగ్ని ప్రమాదంలో 43 మంది మృతి

(మొదటిపేజీ తరువాయి)

కేరళకు చెందినవారుగా తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం కనిపిస్తోంది. కువైట్ లోని అహ్మదీ గవర్నరేట్ లోని మంగాఫ్ బ్లాక్ లో 6 అంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. నివేదికల ప్రకారం మతుల్లో ఐదుగురు మలయాళీలు ఉన్నారు. మరో 40 మంది గాయపడ్డారు. అక్కడి కాలమానం ప్రకారం బుధవారం తెల్లవారుజామున 4.30 గంటలకు లేబర్ క్యాంపులోని కింది అంతస్తులోని ఒక వంటగదిలో మంటలు చెలరేగాయి. అవి క్రమంగా అపార్ట్మెంట్ లోని అన్ని గదులకు వ్యాపించాయి. కొందరు ప్రాణాలను దక్కించుకునేందుకు అగ్నిప్రమాదాన్ని గమనించి బయటకు దూకడంతో మరణించినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. మరికొందరు పొగ పీల్చడంతో, కాలిన గాయాలతో ఊపిరాడక మరణించారు. ఈ ప్రమాదంలో గాయపడినవారు అదాన్, జాబర్, ముబారక్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రమాదం సంభవించిన భవనంలో ఎక్కువగా తమిళనాడు, కేరళ, ఉత్తర భారత ప్రజలు నివసిస్తున్నారు. కువైట్ అగ్నిప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ప్రధాని నరేంద్ర మోడీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కువైట్ నగరంలో జరిగిన అగ్నిప్రమాదం బాధాకరం. నా ఆలోచనలు తమ సన్నిహితులను, ప్రియమైన వారిని కోల్పోయిన వారందరిపై ఉన్నాయి. క్షతగాత్రులు కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను. కువైట్‌లోని భారత రాయబార కార్యాలయం పరిస్థితిని నిశితంగా పరిశీలిస్తోంది. బాధితులకు సహాయం చేయడానికి అక్కడి అధికారులతో కలిసి పని చేస్తోందని మోడీ చెప్పారు.

లైంగిక వేధింపుల కేసులో యడ్యూరప్పకు నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

కర్ణాటక పోలీసు క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్మెంట్ (సీఐడీ) నుంచి నోటీసులు వచ్చాయి. 17 ఏళ్ల మైనర్ బాలికపై యడియూరప్ప లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఈ ఏడాది ప్రారంభంలో కేసు నమోదైంది. చీటింగ్ కేసులో సాయం కోసం ఫిబ్రవరి 2న యడియూరప్ప సాయం కోసం వెళ్లిన సందర్భంలో తన కూతురిపై లైంగిక వేధింపులకు పాల్పడినట్లు బాలిక తల్లి ఫిర్యాదు చేశారు. యడియూరప్పపై పోక్సో యాక్ట్‌తో పాటు ఐపీసీలోని సెక్షన్ 354(ఏ) కింద లైంగిక వేధింపుల కేసు నమోదైంది. యడియూరప్ప తన న్యాయవాదుల ద్వారా సీఐడీ ముందు హాజరు కావడానికి ఒక వారం పొడగింపు కావాలని అభ్యర్థించారు. ప్రస్తుతం ఆయన ఢిల్లీలో ఉన్నారు. ఇప్పటికే విచారణ బందం మూడుసార్లు విచారించింది, ప్రస్తుతం ఆయన నాలుగోసారి విచారణకు హాజరుకావాల్సి ఉంది. తొలుత సదాశివనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తదుపరి విచారణ కోసం సీఐడీకి బదిలీ చేశారు. అయితే, యడియూరప్ప మాత్రం ఈ ఆరోపణల్ని ఖండించారు. నిరాధారమైనవిగా పేర్కొన్నారు. 81 ఏళ్ల యడియూరప్ప కర్ణాటక బీజేపీలో సీనియర్ నేత. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రిగా 2008-2011 మధ్య, 2018లో కొంత కాలం, మళ్లీ జూలై 2019-2021 వరకు సీఎంగా పనిచేశారు. 2021లో సీఎంగా రాజీనామా చేశారు.

ఏపీలో ఉదయించిన చంద్రం

(మొదటిపేజీ తరువాయి)

చేయించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఇది నాలుగోసారి. అనంతరం మంత్రులతో గవర్నర్ ప్రమాణ స్వీకారం చేయించారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేస్తున్న సమయంలో సభా ప్రాంగణం జై చంద్రన్న నినాదాలతో మార్మోగిపోయింది. తెదేపా నేతలు, కార్యకర్తలు తమ స్థానాల్లోనే నిలుచుని చప్పట్లతో అభినందనలు పలికారు. ప్రమాణ స్వీకారం అనంతరం ప్రధాని మోదీతో పాటు వేదికపై ఉన్న పలువురు అతిథులు చంద్రబాబుకు శుభాకాంక్షలు చెప్పారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, నితిన్ గడ్కరీ, రామ్మోహన్‌నాయుడు, చిరాగ్ పాసవాన్ పురంధేశ్వరి, మహారాష్ట్ర సిఎం ఏక్‌నాథ్ షిండే, మాజీ గవర్నర్ తమిళసై, మాజీ సిఎం పన్నీరు సెల్వం తదితరులు కూడా హాజరయ్యారు. పాటు వివిధ పార్టీలకు చెందిన పలువురు జాతీయ నాయకులు హాజరయ్యారు. సినీ ప్రముఖులు చిరంజీవి, రజనీకాంత్ దంపతులు, రామ్‌చరణ్ తదితరులు వచ్చారు. చంద్రబాబు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయనతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్, తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రులుగా ప్రమాణం చేశారు. చంద్రబాబుతో పాటు మరో 24 మంది చేత



గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. మంత్రివర్గ కూర్పులో భాగంగా జనసేన నుంచి ముగ్గురు, భాజపా నుంచి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సీనియర్లకు, యువతకు మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించారు. ఇందులో 17 మంది కొత్తవారే కావడం గమనార్హం. ముగ్గురు మహిళలకు చోటు లభించింది. బీసీలు ఎనిమిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, ముస్లిం మైనారిటీల నుంచి ఒకరికి, వైశ్యుల నుంచి ఒకరికి అవకాశం దక్కింది. నలుగురు కాపులు, నలుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు అవకాశమిచ్చారు. తెదేపా నుంచి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మంత్రివర్గంలో చేరారు. జనసేన నుంచి పవన్ కల్యాణ్, నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్ మంత్రివర్గంలో చోటు దక్కించుకున్నారు. భాజపా నుంచి సత్యకుమార్ యాదవ్‌కు అవకాశం దక్కింది. ప్రమాణ స్వీకారం చేసిన వారిలో పవన్ కల్యాణ్ (జనసేన), నారా లోకేశ్ (తెదేపా), అచ్చెన్నాయుడు (తెదేపా),కొల్లు రవీంద్ర (తెదేపా), . నాదెండ్ల మనోహర్ (జనసేన),పి. నారాయణ (తెదేపా), వంగలపూడి అనిత (తెదేపా), సత్యకుమార్ యాదవ్ (భాజపా),నిమ్మల రామానాయుడు (తెదేపా), ఎన్.ఎమ్.డి ఫరూక్ (తెదేపా), ఆనం రామనారాయణరెడ్డి (తెదేపా), పయ్యావుల కేశవ్ (తెదేపా), అనగాని సత్యప్రసాద్ (తెదేపా),కొలుసు

పార్థసారథి (తెదేపా), డోలా బాలవీరాంజనేయస్వామి (తెదేపా),గొట్టిపాటి రవి (తెదేపా), కందుల దుర్గేశ్ (జనసేన), గుమ్మిడి సంధ్యారాణి (తెదేపా), బీసీ జనార్దన్‌రెడ్డి (తెదేపా), టీజీ భరత్ (తెదేపా),ఎస్.సవిత (తెదేపా), వాసంశెట్టి సుభాష్ (తెదేపా), కొండపల్లి శ్రీనివాస్ (తెదేపా), మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి (తెదేపా) ఉన్నారు. ప్రమాణం చేసిన వారంతా తెలుగులోనే దైవసాక్షిగా ప్రమాణాం చేశారు. ఎన్ఎండి ఫరూక్ తెలుగులోనే అల్లా సాక్షిగా ప్రమాణం చేశారు. టిజి భరత్ ఇంగ్లీషులో ప్రమాణం చేశారు. ప్రమాణస్వీకారం అనంతరం ఒక్కొక్కరే ప్రధాని మోడీ, సిఎం చంద్రబాబు, ఇతర పెద్దలకు అభివాదం చేశారు. చంద్రబాబు పలువురిని మోడీకి పరిచయం చేశారు. పవన్ కల్యాణ్ వేదికపై అందరికి అభివాదం చేసి, తన అన్న చిరంజీవికి పాదాభివందనం చేశారు.

టెట్ ఫలితాలు విడుదల చేసిన రేవంత్ రెడ్డి

TGTET_2024
TGTET_2024
TGTET_2024
TGTET_2024

హైదరాబాద్ జూన్ 12(నిఘా న్యూస్): తెలంగాణ టెట్ ఫలితాలు వెల్లడయ్యాయి. బుధవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టెట్ ఫలితాలను విడుదల చేశారు. టీజీ టెట్ 2024 ఫలితాలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విడుదల చేశారు. టీజీ టెట్2024 పేపర్1కు 57,725 మంది అర్హత సాధించగా, పేపర్2కు 51,443 మంది అర్హత సాధించారు. పేపర్1 లో 67.13శాతం పేపర్2లో 34.18శాతం అర్హత సాధించారు. టెట్2024లో అర్హత సాధించని దరఖాస్తుదారులకు వచ్చే టెట్ కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే వెలుసుబాటు ప్రభుత్వం కల్పించింది. ఇక, టెట్2024లో అర్హత సాధించిన వారికి ఒకసారి ఉచితంగా డిఎస్సికి దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించింది. కాగా, గత మార్చి 15వ తేదీన టిజిటెట్ 2024 నోటిఫికేషన్ వెలువడగా.. పేపర్1కు 99,958 మంది, పేపర్2కు 1,86,423 మంది దరఖాస్తు చేసుకున్నారు. మే 20వ తేదీన ప్రారంభమైన టెట్ పరీక్షలు జూన్ 2వ తేదీతో ముగిశాయి. పేపర్1కి 86.03 శాతం మంది, పేపర్2కి 82.58 శాతం మంది అభ్యర్థులు హాజరయ్యారు. పేపర్1లో 67.13 శాతం మంది, పేపర్2 లో 34.18 శాతం మంది అర్హత సాధించారు. పేపర్1లో మొత్తం 85,996 మంది పరీక్ష రాయగా 57,725 మంది క్వాలి అయ్యారు. పేపర్2కు మొత్తం 1,50,491 మంది పరీక్ష రాయగా.. కేవలం 51,443 మంది మాత్రమే అర్హత సాధించారు. అభ్యర్థులు ఫలితాల కోసం వెబ్‌సైట్‌ను సందర్శించాలని అధికారులు సూచించారు. గత ఏడాది జరిగిన టెట్ పరీక్షలతో పోలిస్తే ఈ ఏడాది పేపర్1లో ఉత్తీర్ణత శాతం 30.24 శాతం, పేపర్2లో ఉత్తీర్ణత శాతం 18.88 శాతం పెరిగిందని వెల్లడించారు. అయితే టెట్ దరఖాస్తుదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉపశమనం కల్పించింది. సారి టెట్ అర్హత సాధించనివారు వచ్చే టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. అదేవిధంగా టెట్‌లో అర్హత సాధించిన వాళ్లు డీఎస్సీకి ఎలాంటి ఫీజులేకుండా ఉచితంగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఇచ్చింది. ఎన్నికల కోడ్ కారణంగా టెట్2024 ఫీజును తగ్గించలేకపోయామని ప్రభుత్వం తెలిపింది. అందుకే తదుపరి టెట్, డీఎస్సీ దరఖాస్తుదారులకు ఉపశమనం కల్పించాలని నిర్ణయించినట్లు వెల్లడించింది.

ఒడిషా సిఎంగా... మోహన్ చరణ మాఝి ప్రమాణం

భువనేశ్వర్ జూన్ 12(నిఘా న్యూస్): ఒడిశాలో బిజెపి ప్రభుత్వం కొలువుదీరింది. నూతన ముఖ్యమంత్రిగా మోహన్ చరణ మాఝి ప్రమాణస్వీకారం చేశారు. దీంతో రాష్ట్రంలో భాజపా తరపున తొలి సీఎంగా రికార్డు సృష్టించారు. ఆయనతోపాటు ఆరుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన కనక్ వర్ధన్ సింగ్‌దేవ్, తొలిసారి ఎమ్మెల్యే అయిన ప్రవతి పరీదాలు ఉప ముఖ్యమంత్రులుగా ప్రమాణం చేశారు. వీరితోపాటు మంత్రులుగా సురేశ్ పుజారి, రబీనారాయణ్ నాయక్, నిత్యానంద గోండ్, కృష్ణ చంద్ర పాత్ర ప్రమాణం చేశారు. గవర్నర్ రఘుబర్‌దాస్ చేతులవిరీదుగా ఈ కార్యక్రమం జరిగింది. భువనేశ్వర్‌లోని జనతా మైదాన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ,పలువురు కేంద్ర మంత్రులు, ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ కూడా హాజరయ్యారు. నవీన్ నివాస్‌కు వెళ్లిన ఆయన ప్రమాణ స్వీకారానికి హాజరు కావాలని నవీన్‌ను స్వయంగా ఆహ్వానించారు. న్యాయశా పట్టభద్రుడైన ఆయన కేంఝర్ అసెంబ్లీ స్థానం నుంచి నాలుగుసార్లు 2000, 2009, 2019, మళ్లీ 2024లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 2019 నుంచి 2024 వరకూ శాసనసభలో భాజపా సభాపక్ష కార్యదర్శిగా, చీఫ్ విప్‌గా విధులు నిర్వహించారు.

పాసు పుస్తకాలు చేయిస్తానంటూ... రైతుల వద్ద నుండి

లక్షలు వసూలు చేసిన వీఆర్ఏ..?

సాదాబైనామాలో గత మాజీ విఆర్ఏ చేతివాటం

ఒక్కొక్కటిగా బయటపడుతున్న అక్రమాలు

తహశీల్దార్ కార్యాలయంలో తిష్టవేసిన ఘనుడు

ఫిర్యాదు కోసం వస్తే రైతులను బెదిరింపులకు గురి చేస్తున్న వైనం

పాలేరు జూన్ 12 (నిఘా న్యూస్): ఏళ్లుగా పరిష్కారం కానీ భూములకు పరిష్కారం చూపుతూ రైతులకు మేలు జరిగేలా గత తెలంగాణ ప్రభుత్వం తీసుకుని వచ్చిన సాదాబైనమా పథకం కొందరు అక్రమార్కులకు వరంగా మారింది. రైతుల అమాయకాత్వాన్ని ఆసరాగా చేసుకుని ఓ మాజీ విఆర్ఏ పట్టాదార్ పాస్ పుస్తకాలు చేపిస్తానని లక్షలు కాజేసి ముఖం చాటేసిన వైనం తిరుమలాయపాలెం మండలంలోని కాకరవాయి శివారు ఏనేకుంటతండా గ్రామంలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.బాధితుల కథనం మేరకు తండాలోని కొందరు రైతులు ఇతరుల వద్ద భూములు కొనుగోలు చేశారు.ఈ భూములను

గత ప్రభుత్వం కల్పించిన రెండో దఫా సాదాబైనామాలో క్రమబద్దీకరణ చేసుకుని పట్టాదార్ పాస్ పుస్తకాలను పొందేందుకు దరఖాస్తు చేసుకున్నారు. ఈ నేపథ్యంలో సమీప గ్రామానికి చెందిన ఓ సీనియర్ మాజీ విఆర్ఏ మీకు పట్టాధార్ పాస్ పుస్తకాలు చేయిస్తానని మాయ మాటలు చెబుతూ సుమారుగా యాభై మంది రైతుల దగ్గర లక్షల రూపాయలు డబ్బులు వసూల్ చేశాడు.కాలం గడుస్తున్నా కొందరు రైతులకు పాస్ పుస్తకాలు మంజూరు కాకపోవడంతో సదరు విఆర్ఏ ఇంటికి వెళ్లి ప్రశ్నించగా రేపు,మాపు అవుతాయంటూ కాలం వెళ్లదీశాడు.

రెవెన్యూ వ్యవస్థ రద్దుతో గుట్టురట్టు

రెవెన్యూశాఖలో విఆర్ఏ,విఆర్వో వ్యవస్థ రద్దు కావడం,పాస్ పుస్తకాల తాలూకు డబ్బులు ఇవ్వకుండా రైతుల నుండి తప్పించుకుని తిరగడం మొదలు పెట్టాడు.ఈ క్రమంలో బాధిత రైతులు అంతా ఒక్కటై మాజీ విఆర్ఏను నిలదీయగా నీళ్లు నములుతూ ప్రస్తుతం తాను తహశీల్దార్ కార్యాలయంలోనే పని చేస్తున్నానని కచ్చితంగా పాస్ పుస్తకాలు చేయిస్తానని మళ్లీ టోకరా వేశాడు.ఏళ్లు గడుస్తున్నా పాస్ పుస్తకాల పని కాకపోవడం,తీసుకున్న డబ్బులు ఇవ్వక పోవడంతో ఘరానా విఆర్ఏ అక్రమ వసూళ్ల పర్వం బట్టబయలైంది.

ఇదిలా ఉండగా కొందరి రైతుల భూములను ఇతర రైతుల పేరున ఎక్కించి పాస్ పుస్తకాలు ఇప్పించాడని బాధితులు లబోదిబోమంటు వాపోతున్నారు.భూములకు సంబంధం లేని వ్యక్తుల పేరున ఎక్కించి పెద్ద ఎత్తున డబ్బులు దండుకున్నాడని తండా రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో కొందరు రైతులు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ,సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కి సైతం ఫిర్యాదు చేశారని సమాచారం. కాగా మరికొందరు రైతులు సమిష్టిగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డిని కలిసి మాజీ విఆర్ఏ పై ఫిర్యాదు చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు... నేడు తొలి సంతకం

(మొదటిపేజీ తరువాయి)

స్కిల్ సైన్సెస్‌పై నాలుగో సంతకం, అన్న క్యాంటీన్ల ఏర్పాటుపై ఐదో సంతకం చేయనున్నారు. దీనికి సంబంధించిన దస్త్రాలను అధికారులు సిద్ధం చేస్తున్నట్టు తెలుస్తోంది. ప్రమాణ స్వీకారం తర్వాత ఉండవల్లిలోని తన నివాసంలో మంత్రులతో చంద్రబాబు సమావేశమయ్యారు. మంత్రి వర్గంలో చోటు కల్పించినందుకు ఈ సందర్భంగా మంత్రులు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలిసి సీఎం తిరుమల వెళ్లారు. శ్రీవారి దర్శనం అనంతరం గురువారం అమరావతి చేరుకుంటారు. ఇదిలావుంటే ఆంధ్రప్రదేశ్‌లో ఐదేళ్ల వైసీపి పాలనలో జరిగిన అవకతవకలు, విధ్వంసంపై టీడీపీ ప్రభుత్వం శ్వేతపత్రాలు విడుదల చేయనుంది. రాష్ట్రంలో విధ్వంసంపై శాఖల వారీగా విడుదల చేయనున్నట్లు సమాచారం. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, అక్రమాలపై వరసగా శ్వేతపత్రాలు విడుదల చేయనున్నారు. రాష్ట్ర విభజనకు పూర్వం కాంగ్రెస్ హయాంలో జరిగిన విధ్వంసాలపైనా 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం ఇలాగే స్వేతపత్రాలు విడుదల చేసింది. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో చర్చ మెదలైంది. వైసీపీ హయాంలో ఇసుక, మద్యం పాలసీలపై అప్పటి ప్రతిపక్షాలు విపరీతంగా ఆరోపణలు చేశాయి. ఇసుక ఇష్టానుసారం తోడేస్తున్నారని, కల్తీ మద్యాన్ని ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించి అక్రమంగా సొమ్ము చేసుకుంటున్నారంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. గనుల శాఖలోనూ పలు అక్రమాలు జరిగాయంటూ ప్రతిపక్షాలు ఆరోపించాయి. ప్రస్తుతం శ్వేతపత్రాలు విడుదల చేయనున్న నేపథ్యంలో ఎలాంటి అవకతవకలు బయట పడనున్నాయో వేచి చూడాల్సిందే.

బ్రిటన్ ఎన్నికల్లో హిందువుల డిమాండ్లు

(మొదటిపేజీ తరువాయి)

'హిందూస్ ఫర్ డెమోక్రసీ' సంయుక్తంగా విడుదల చేసింది. ఈ డిమాండ్లలో హిందువులపై ద్వేషాన్ని ఆపడం, దేవాలయాలను రక్షించడం వంటి అంశాలు ఉన్నాయి. 'హిందూస్ ఫర్ డెమోక్రసీ' అనేది స్వామినారాయణ్ సంస్థ, చిన్మోయ్ మిషన్, విశ్వ హిందూ పరిషత్ విభాగం, హిందూ కౌన్సిల్ హిందూ ఫోరమ్ ఆఫ్ బ్రిటన్, హిందూ టెంపుల్ నెట్‌వర్క్ హిందూ దేవాలయాల జాతీయ మండలితో సహా 15 హిందూ సంస్థల సమూహం. ఇస్కాన్ కూడా ఉంది. ఇప్పటివరకు, కన్జర్వేటివ్ పార్టీకి చెందిన నలుగురు అభ్యర్థులు, బాబ్ బ్లాక్‌మన్, రాబర్ట్ బక్‌ల్యాండ్, రాహిష్ సింగ్, తెరాస విలియర్స్ ఈ మేనిఫెస్టోకు మద్దతు ఇచ్చారు. (గతంలో ట్విట్టర్)లో తన డిమాండ్లను పంచుకుంటూ రాబోయే ప్రభుత్వం నుంచి ఏడు డిమాండ్లు కోరినట్లు సమూహం తెలిపింది. 2021 జనాభా లెక్కల ప్రకారం ఇంగ్లాండ్, వేల్స్‌లో హిందువుల సంఖ్య 1,0327,75గా ఉంది. ఇది మొత్తం ఆ దేశ జనాభాలో 1.7 శాతం. బ్రిటన్‌లో హిందూ మతం మూడవ అతిపెద్ద మతంగా అవతరించింది. ఇది క్రైస్తవం, ముస్లిం మతం తర్వాత మూడవ స్థానంలో ఉంది. చాలా మంది హిందువులు గ్రేటర్ లండన్, సౌత్ ఈస్ట్‌లో నివసిస్తున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని మరో మూడు దేశాల్లో హిందువుల జనాభా 50 వేల కంటే తక్కువగా ఉంది. హిందువులు 19వ శతాబ్దం ప్రారంభం నుండి యునైటెడ్ కింగ్‌డమ్‌లో స్థిరపడటం ప్రారంభించారు. బ్రిటన్‌లోని హిందువులు ప్రజాస్వామ్యం కోసం బ్రిటిష్ ప్రభుత్వం నుండి ఈ క్రింది ఏడు ప్రతిజ్ఞలను సమిష్టిగా డిమాండ్ చేశారు.బ్రిటన్‌లోని హిందువులకు సంబంధించిన సమస్యలపై చట్టాలు చేసే ముందు హిందూ సంస్థలను సంప్రదించాలని మేనిఫెస్టోలో పేర్కొన్నారు. దీంతో పాటు పలు కీలక అంశాలు ప్రస్తావించారు. బ్రిటన్‌లో సేవలందించిన హిందూ సైనికుల స్మారక చిహ్నం, శ్మశానవాటికలను నిర్మించాలి. మరణించిన మూడు రోజులలోపు హిందూ దహన సంస్కారాలను అనుమతించడానికి కరోనర్ ప్రక్రియను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు.

నేడు మోడీ తొలి విదేశీ పర్యటన

(మొదటిపేజీ తరువాయి)

జరనుంది. ఈ పర్యటనలో భారత్, ఇటలీ మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై కూడా చర్చించనున్నట్లు ఇటలీలోని భారత రాయబారి వాణీ రావు తెలిపారు. జీ7 సదస్సుకు ప్రధాని మోదీతో పాటు అమెరికా, ఫ్రాన్స్, జపాన్, కెనడా, బ్రిటన్, జర్మనీ దేశాల నేతలు హాజరుకానున్నారు. జూన్ 13,14 తేదీల్లో గ్రూప్ ఆఫ్ సెవెన్ సమావేశానికి భారత్ ప్రధాని హోదాలో మోదీ హాజరు కానున్నారు. లోక్ సభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలిచిన తర్వాత జార్జియా మెలోని మోదీకి అభినందనలు తెలిపారు. ఉ7 సమ్మిట్ 2024 జూన్ 13 నుంచి15 తేదీలలో అపులియాలోని బోర్గో ఎగ్నాజియాలో నిర్వహిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు జో బిడెన్, కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో, బ్రిటన్ ప్రధాని రిషి సునక్, ఫ్రాన్స్‌కు చెందిన ఇమ్మాన్యుయేల్ మాక్రాన్, జపాన్‌కు చెందిన ఫ్యూమియో కిషిసా, జర్మన్ ఛాన్సలర్ ఓలాఫ్ స్కోల్జ్ ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలుస్తోంది.

హమాస్, ఇజ్రాయెల్... కాల్పుల విరమణకు ఐక్య రాజ్య సమితి ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రతిపాదించినటువంటి ఈ తీర్మానానికి మండలిలోని 15 సభ్య దేశాల్లో 14 దేశాలు ఆమోదం తెలిపాయి. రష్యా మాత్రం ఓటింగ్ కు గైర్హాజరైంది. మూడు దశలతో కూడిన కాల్పుల విరమణ ప్రణాళికను ఇజ్రాయెల్, హమాస్‌లు తక్షణం అమలు చేయాలని ఈ తీర్మానం కోరింది. ఈ ప్రణాళికను అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ గత నెలలో ప్రకటించారు. కాల్పుల విరమణకు, యుద్ధానంతరం గాజా పాలనకు సంబంధించిన ప్రణాళికలకు మద్దతు కూడగట్టేందుకు అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ ఇజ్రాయెల్ లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో సమావేశం అయ్యారు. కాల్పుల విరమణ ప్రతిపాదన రావాల్సి ఉందని అన్నారు. కాల్పుల విరమణ ప్రతిపాదనకు ఇజ్రాయెల్ ఆమోదం ఉందని అమెరికా చెబుతున్నది. అయితే, అందులోని పలు అంశాలను నెతన్యాహు బహిరంగంగానే వ్యతిరేకించారు. హమాస్ ను అంతమొందించడానికే తాము ఇప్పటికే కట్టుబడి ఉన్నట్లు పేర్కొన్నారు. సంధి ప్రయత్నాలపై హమాస్ నుంచి ఇంకా ఎటువంటి అధికారిక స్పందనైతే రాలేదు. భద్రతా మండలి తాజా తీర్మానాన్ని ఆ ముఠా స్వాగతించింది. కాల్పుల విరమణ అమలవుతుందన్న భరోసా తమకు ఉండాలంటూ స్పష్టం చేసింది. కొన్ని అంశాలపై స్పష్టత కావాలని, ఈ పోరుకు శాశ్వత ముగింపు పలకాలని తెలిపింది. అమెరికా, ఇజ్రాయెలీ గూఢచర్య నెట్ వర్క్ ను తాము భగ్నం చేసినట్లు యెమెన్ లో హూతీ తిరుగుబాటుదారులు ప్రకటించారు. అయితే, కొద్దిరోజుల కిందట ఐక్య రాజ్య సమితి సిబ్బంది, దాతత్వ సంస్థల సిబ్బందిని అరెస్ట్ చేసిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది. దక్షిణ గాజాలోని రఫాలో జరిగినటువంటి ఒక పేలుడులో నలుగురు ఇజ్రాయెల్ సైనికులు మృతి చెందారు. 2006లో ఇజ్రాయెల్ సైనికుడు గిలాద్ షాలిత్ అపహరణలో కీలక పాత్ర పోషించిన ఉగ్రవాది ఓ భవనంలో ఉన్నాడంటూ సమాచారం అందడంతో ఆ భవనాన్ని పేల్చివేసేందుకు నెతన్యాహు సేన సిద్ధమైంది. అయితే, వారి వద్ద ఉన్నటువంటి పేలుడు పదార్థాలు ముందుగానే పేలడంతో నలుగురు సైనికులు మతిచెందారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు.

గ్రూపులు కడితే తోకలు కత్తిరిస్తా

(మొదటిపేజీ తరువాయి)

డాక్టర్ కడియం కావ్య పరిచయ, ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖతో కలిసి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ అభివద్ధిలో అగ్రగామిగా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం ఉండాలన్నారు. ఇప్పుడు నా బాధ్యత పెరిగిందని, నియోజకవర్గంలో గ్రూపులు లేవన్నారు. ఎవరైనా గ్రూపులు అని తిరిగితే తోకలు కత్తిరించడం ఖాయమని ఆయన వ్యాఖ్యానించారు. పని లో పోటీ పాడుదాం, కూర్చునే సీటులో కాదని, దేవాదుల ప్రాజెక్టుతో నియోజక వర్గంలో ప్రతీ గ్రామానికి సాగు నీరు అందించె బాధ్యత నాది అని ఆయన వ్యాఖ్యానించారు. అంతేకాకుండా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలో విద్యా, వైద్యంలో చాలా వెనక బడి ఉన్నాం. విద్యా, వైద్యంలో అన్ని రకాల అభివద్ధికి త్వరలోనే శ్రీకారం చుట్టాలి. నియోజకవర్గంలో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత ఉంది. నా ఎజెండా అభివద్ధి, విద్యా, వైద్యం, ప్రతీ ఎకరాకు సాగు నీరు అందించడం. నియోజకవర్గ ప్రజలు నన్ను అర్థం చేసుకోవాలని ఆయన అన్నారు. అనంతరం ఎంపీ డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ నాకు భారీ మెజారిటీతో విజయాన్ని అందించిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులందరికి పేరు పేరునా కతజ్ఞతలు తెలిపారు. ఎవరికీ వారే అభ్యర్థిగా భావించి నా కోసం కష్ట పడ్డారని, నా గెలువుకు కషి చేసిన ప్రతీ ఒక్కరికీ అందుబాటులో ఉంటు మీ అందరి కష్టసుఖలలో పాలు పంచుకుంటానని ఆమె అన్నారు. మీ అందరి ఆశీర్వాదం ఎల్లప్పుడూ ఇలాగే ఉండాలని, రాబోయే రోజుల్లో మంచి రోజులు రానున్నాయని, ఎంపీ ఎన్నికలతో అయిపోలేదు స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ జెండా ఎగుర వేయాలని ఆమె అన్నారు. నా తండ్రి కడియం శ్రీహరి పేరు నిలబెట్టే విధంగా పని చేస్తానన్నారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ డాక్టర్ కడియం కావ్య గెలుపుకు కషి చేసిన కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు. కడియం శ్రీహరి వ్యక్తిత్వం గొప్పది. కడియం శ్రీహరి గొప్ప పరిపాలన అనుభవం ఉన్నది, అవినీతి రహితమైన పాలన అందించే వ్యక్తి కడియం శ్రీహరి. స్థానిక సంస్థల ఎన్నికలలో కూడా ఇదే క్రమశిక్షణతో పని చేయాలి. కాంగ్రెస్ పార్టీలో ప్రతీ ఒక్కరికీ సమూచిత స్థానం దక్కుతుంది. కార్యకర్తలు ఓపికగా ఉండాలి. అర్హులైన



ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలి. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో నిష్పాక్షపాతంగా, అవినీతి రహితంగా అర్హులైన వారికే సంక్షేమ పథకాలు అందాలి. దానికోసం సమన్వయంతో పని చేయాల్సిన బాధ్యత ఉంది. తండ్రికి తగ్గ తనయగా పేరు తెచ్చుకోవాలి. రాబోయే రోజులల్లో మంచి రాజకీయ భవిష్యత్ ఉంది. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గలను సమ దష్టితో చూడాలి. వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభివద్ధికి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చి అభివద్ధి చేయాలి. ఎల్లపుడు నీకు మా అందరి ఆశీస్సులు ఉంటాయని ఆమె అన్నారు.

భైంసా రూరల్ సీఐగా నైలు బాధ్యతలు

భైంసా జూన్ 12 (నిఘా న్యూస్) రూరల్ నూతన సీఐగా నైలు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కబీర్,కుంటాల, భైంసా రూరల్ ఎస్ఐ లు స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. మట్కా గుట్కా, పేకాట, ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థతుల్లోనూ రాజీపడే ప్రసక్తే లేదన్నారు.

ప్రభుత్వ పాఠశాలలు గ్రామాలకు పట్టు కొమ్మలు

కేశంపేట జడ్పిటిసి తాండ్ర విశాల

షాద్ నగర్/కేశంపేట్, జూన్ 12(నిఘా న్యూస్): మండల కేంద్రంలోని పాపిరెడ్డి గూడ గ్రామలో బుధవారం స్థానిక ఎంఈఓ మనోహర్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫామ్స్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కేశంపేట జడ్పిటిసి తాండ్ర విశాల మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని ఇందులో భాగంగా నాణ్యమైన విద్యను మంచి సౌకర్యాలతో ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాల మెరుగుపరుస్తూ ముందుకు వెళ్తున్నారని తెలియజేశారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు సమన్వయంతో ముందుకు సాగుతూ ప్రభుత్వ పాఠశాలకు పూర్వవైభవం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మార్వో, ఇన్చార్జ్ ఎంపిడిఓ, ప్రాథమిక పాఠశాల ఉన్నత పాఠశాల హెచ్ఎమ్స్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నీట్ పరీక్షలు మళ్ళీ నిర్వహించాలి

టీజేఎస్ జిల్లా అధ్యక్షులు ఎంఏ. ఖాదర్ పాష

వనపర్తి, జూన్ 12(నిఘా న్యూస్): నీట్ పరీక్ష అవకతకలపై సమగ్ర విచారణ జరిపించి మళ్లీ పరీక్షలు నిర్వహించాలని తెలంగాణ జన సమితి పార్టీ వనపర్తి జిల్లా అధ్యక్షులు ఎంఏ. ఖాదర్ పాష డిమాండ్ చేశారు. జూన్ 4న వచ్చిన ఫలితాలలో ఎలాంటి హడావుడి లేకుండా దేశంలో సర్వత్రిక ఎన్నికల ఫలితాలు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టీఏ ప్రకటించడం వెనుక అంతర్యం ఏమిటని ఖాదర్ పాష ప్రశ్నించారు. ఫలితాలు ముందుగా జూన్ 14న విడుదల చేస్తామని ప్రకటించి ఎలాంటి సమాచారం లేకుండా ఫలితాలు వెల్లడించడంపై దేశవ్యాప్తంగా అనేక ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో సమగ్ర దర్యాప్తు జరిపించాలన్నారు. గత పరీక్షల్లో జరిగిన ఘోర తప్పిదాలు, అవకతవకలు మళ్లీ పునరావృతం అవుతాయని విమర్శించారు. వైద్యరంగంలో రాష్ట్ర ఆధారిత ఉమ్మడి ప్రవేశ పరీక్ష విధానాన్ని మార్చడం వల్ల అంతులేని అవినీతి జరిగిందన్నారు. ఎన్ టీ ఏ ను రద్దు చేయాలని, ఇప్పటివరకు దాని స్కాములన్నిటిని సమగ్రంగా విచారించాలని ఆయన డిమాండ్ చేశారు.

ముధోల్ లో బడిబాట ర్యాలీ

ఎమ్మెల్యే పవర్ రామారావు పటేల్

భైంసా, జూన్ 12 (నిఘా న్యూస్): పట్టణంలోని ఫిఫ్రి కాలని పాఠశాల బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడం జరిగిందని, ఇంగ్లీష్ మీడియంలో నాణ్యమైన విద్యా బోధన, పౌష్టికాహారంతో మధ్యాహ్న భోజనం, సువిశాలమైన ఆట స్థలాలు, పాఠశాలలోనే గ్రంథాలయాలు, ప్రొజెక్టర్ల ద్వారా విద్యా బోధన, ఉచితంగా స్కూల్ యూనిఫామ్ వంటివి అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలలోనే చేర్పించి తమ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక జడ్పిటిసి,ఎంపీపీ,కౌన్సిలర్లు పట్టణ అధ్యక్షులు, బీజేపీ నాయకులు విద్యాధికారులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

త్వరలో 11 వేల ఉపాధ్యాయుల నియామకం

- విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య
- ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయి విద్య
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి

వనపర్తి, జూన్ 12(నిఘా న్యూస్): పేద,ధనిక అనే తారతమ్యం లేకుండా విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ముందుకు వెళుతుందని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జి.చిన్నా రెడ్డి అన్నారు. బుధవారం నుండి పునఃప్రారంభమైన విద్యాలయాల్లో పండగ వాతావరణం కల్పించే విధంగా మామిడి తోరణాలు, కొబ్బరి మాటలతో కళకళలాడుతుండగా విద్యార్థులు నూతనోత్సాహంతో బడిలో అడుగులు పెట్టారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమం వనపర్తి జిల్లా అంతట వేడుకగా ప్రారంభం కాగా గోపాల్ పేట మండలంలోని జయన్న తిర్మలాపూర్,మున్ననూర్, తాడిపర్తి, గోపాల్ పేట ప్రభుత్వ పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాల్లో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారెడ్డి తాను పుట్టి పెరిగిన ఊరు జయన్న తిర్మలాపూర్ కావడంతో ప్రభుత్వ ప్రాథమికొన్నత పాఠశాల తిర్మలాపూర్ కు మొదట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాస్త ఆర్థిక స్థోమత ఉన్నవారు తమ పిల్లలను ఆంగ్ల మాధ్యమంలో కాన్వెంట్ పాఠశాలల్లో చదివిస్తారని, పేద కుటుంబం వారు మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివిస్తారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు ఎలాంటి లోటు లేకుండా వాటిలో సైతం క్రమంగా ఇంగ్లీష్ మీడియం ప్రవేశ పెడుతూ అన్ని మౌలిక వసతులు ప్రభుత్వ పాఠశాలలకు కల్పించి కార్పొరేట్ స్థాయి విద్యను పేద పిల్లలకు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మరి కొన్ని రోజుల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం, సాయంత్రం స్నాక్స్ ఇచ్చే విధంగా ప్రణాళికలు చేస్తుందన్నారు.త్వరలోనే మెగా డిఎస్సీ నిర్వహించి 11 వేల ఉపాధ్యాయులను నియమించ నున్నట్లు తెలిపారు. తిర్మలాపూర్ లో ప్రస్తుతం ఉన్న పాఠశాలకు అదనంగా మరో రెండు అదనపు తరగతి గదుల నిర్మాణం చేయిస్తానని, కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటానని చెప్పారు. తిర్మలాపూర్ గ్రామంలో ఒక పెద్ద కార్పొరేట్ స్థాయి పాఠశాలను నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను చేపడతామని చెప్పారు. గ్రామంలో మరో హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోట్ బుక్కులు, ఏకరూప దుస్తులు అందజేశారు. పిల్లలు బాగా చదువుకోవాలని, దాదాపు మూడు పూటలు భోజనం పాఠశాలలోనే అందించే విధంగా ఏర్పాట్లు చేస్తున్నందున అందరూ ప్రభుత్వ పాఠశాలలోనే పేర్లు నమోదు చేయించుకొని నాణ్యమైన విద్యను పొందాలని సూచించారు. మున్ననూర్, తాడిపర్తి, గోపాల్ పేట పాఠశాలల్లో పర్యటించి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలను అందజేశారు. అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎం.నగేష్, పిఆర్ ఈఈ మల్లయ్య, మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్, గోపాల్ పేట ఎంపీడీఓ శంకర్, ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్, మున్ననూర్ ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు సురేందర్, ఉపాద్యాయులు, విద్యార్థులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహ వివాదం

- ప్రొఫెసర్ జయశంకర్ పాత విగ్రహాన్ని మార్చవద్దని డిమాండ్
- షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో పినపాక ఫిర్యాదు

షాద్ నగర్, జూన్ 12(నిఘా న్యూస్) నియోకవర్గంలో 2014 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం సందర్భంగా రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణ కేంద్రంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం ముఖద్వారం వద్ద తెలంగాణ స్వాప్నికుడు ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాన్ని అప్పట్లో ఏర్పాటు చేశారు. అప్పటి తెలంగాణ మంత్రి జూపల్లి కృష్ణారావు స్థానిక ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రస్తుత ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజాసంఘాల టిజేఏసి నాయకులు తదితరులు ఈ విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఈ విగ్రహం స్థానంలో మరో పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రజాసంఘాల నాయకులు పూనుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే శంకర్ సహకారంతో పెద్ద విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అయితే బుధవారం ఈ విగ్రహం వద్ద నిర్మాణ పనులు చేపట్టేందుకు ప్రజాసంఘాల నాయకులు అక్కడికి రావడంతో అంతకు ముందు టీజేఏసీలో పనిచేసి విగ్రహ ఏర్పాటుకు తోడ్పడిన పినపాక ప్రభాకర్ రావు దీనిని వ్యతిరేకించారు. ప్రజాసంఘాల నాయకులు పినపక ప్రభాకర్ రావు మధ్య వాగ్వాదం జరగడంతో ప్రభాకర్ రావు ఈ విగ్రహాన్ని పాత స్థలం నుండి తీసి కొత్త విగ్రహాన్ని పెట్టేందుకు వీలులేదని వాదిస్తున్నారు. ఈ మేరకు ఈ వ్యవహారంపై స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలకు మరమ్మత్తులు చేపట్టండి

- కోటి రూపాయలు ప్రకటించినా పూర్తి పూర్తికాని పనులు
- ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు

వనపర్తి, జూన్ 12(నిఘా న్యూస్): వనపర్తి జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత (బాలుర) పాఠశాలలో గొప్పోళ్ళు చదువుకున్నారని, అటువంటి పాఠశాలలో విద్యార్థులకు తగినన్ని సౌకర్యాలు లేవని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ అన్నారు. బుధవారం ఆయన ఆ పాఠశాలను సందర్శించి పరిశీలించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు. జిల్లాలోనే ప్రథమ పాఠశాల ఇదేనని, ముఖ్యమంత్రి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నత అధికారులు ఏర్పాటు చేసింది ఈ పాఠశాల అని గుర్తు చేశారు.జిల్లాకే వన్నే తెచ్చిన వనపర్తి ప్రభుత్వ పాఠశాల అని, ఇక్కడ చదివిన ఎంతోమంది విద్యార్థులు ముఖ్యమంత్రి స్థాయి నుండి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలయ్యారని, వివిధ స్థాయిలో ఉద్యోగస్తులు దేశ, విదేశాలలో పనిచేస్తున్నారని అన్నారు. అలాంటి వారు చదివిన ఈ పాఠశాలలో చదివే పిల్లలకు సౌకర్యాలు సరిగా లేవని, ఎంతో ప్రతిష్టాత్మకంగా తెలంగాణ రాష్ట్రంలో మన ఊరు-మనబడి కార్యక్రమాన్ని గత ముఖ్యమంత్రి కేసీఆర్ వనపర్తికి వచ్చి ప్రారంభించారని, ఆ సందర్భంగా పాఠశాల బాగుకోసం కోటి రూపాయలు ప్రకటించారని చెప్పారు. కానీ ఇంతవరకు పూర్తి స్థాయిలో పనులు కాలేదని, వెంటనే ఆ నిధులను వెచ్చించి పాఠశాలను బాగు చేయాలని కోరారు. జిల్లా కేంద్రంలోని ఈ పెద్ద పాఠశాలను బాగు చేయకుంటే మిగతా పాఠశాలలను ఎలా బాగు చేస్తారని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ఇదే పాఠశాలలో చదువుకున్నాడని, కాబట్టి వెంటనే ప్రభుత్వ బాలుర,బాలికల పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసి విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మన ఊరు-మన బడి కార్యక్రమంలో వనపర్తి జిల్లాలోని పాఠశాలలను వెంటనే బాగుపరిచి విద్యార్థులకు తగిన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలను అఖిలపక్ష ఐక్యవేదిక తరపున డిమాండ్ చేస్తున్నామని అన్నారు.

నిఘా న్యూస్ కథనానికి స్పందన

లోకేశ్వరం జూన్ 12 (నిఘా న్యూస్): మండలం రాయపూర్ కాండ్లీ గ్రామంలోని ప్రమాధకరంగా మారిన విద్యుత్ తీగలు నిలబడితే తాకే ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలను చూసి గల్లీ వాసులు, భయాందోళన చెందుతున్నారని ప్రచురితమైన నిఘా న్యూస్ కథనానికి విద్యుత్ శాఖ అధికారులు వేలాడుతున్న విద్యుత్ తీగలను ఎత్తులో అమర్చారు. దీంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో లైన్ మెన్ సాయిబాబా, జేఎల్ఎం శ్రీకాంత్, విద్యుత్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అభివృద్ధి బాటలో జల్పల్లి

ఎమ్మెల్యే సబితకు కాట్రగడ్డ కృతజ్ఞతలు

మహేశ్వరం, జూన్ 12 (నిఘా న్యూస్): అభివృద్ధి ప్రదాత ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అని మాజీ సైనికుడు, జల్పల్లి మున్సిపాలిటీ సోషల్ మీడియా ఇంచార్జ్ కాట్రగడ్డ వాసుబాబు అన్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని వారి నివాసంలో కలిసి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దర్శించుకొని తీసుకువచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవారి ప్రసాదంను, వెంకటేశ్వర స్వామి చిత్రపటాన్ని సబితా ఇంద్రారెడ్డికి అందజేసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహేశ్వరం నియోజకవర్గంలో పాటు అభివృద్ధిలో వెనుకబడ్డ జల్పల్లి మున్సిపాలిటీలో కోట్లాది రూపాయల నిధులు వెచ్చించి అనేక అభివృద్ధి పనులు చేయించిన ఘనత సబితా ఇంద్రారెడ్డికి దక్కుతుందన్నారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి మహేశ్వరం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత అని వర్ణించారు.

మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలి

CITU
తెలంగాణ గ్రామ పంచాయతీ
ఎంప్లాయిస్ & వర్కర్స్ యూనియన్
(CITU అనుబంధం)
రి.నెం. 2894/2014
వనపర్తి జిల్లా కమిటీ

గ్రామ పంచాయతీ కార్మికుల పెండింగ్ వేతనాలు ఇవ్వాలి

వనపర్తి, జూన్ 12(నిఘా న్యూస్) పెండింగ్ లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని, మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మండ్ల రాజు డిమాండ్ చేశారు. బుధవారం వనపర్తి జిల్లా కేంద్రంలో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ ఆండ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జిల్లా కాలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ నగేష్ కు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అంతకు ముందు మర్రికుంట మెయిన్ రోడ్డు నుండి ప్రదర్శన నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలిచాలనీ వేతనాలతో గ్రామీణ ప్రాంతాలలో ప్రజల ఆరోగ్యాలు కాపాడుతూ తమ జీవితాలను కోవ్వోత్తిలాగా కరిగించుకున్న గ్రామ పంచాయతీ కార్మికులపై నూతనంగా ఏర్పడిన ప్రభుత్వం సవతి తల్లీ ప్రేమ చూపుతుందని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభం కావడం జరిగిందని, గ్రామపంచాయతీ కార్మికులు వారి పిల్లల కు విద్యకు సంబంధించిన వస్తువులు (సామగ్రి) ఇప్పించడం కోసం కూడా వారితో డబ్బులు లేవని, ఈ ప్రభుత్వం వారి పిల్లలను చదువుకు దూరం చేసే విధంగా విధానాలను అవలంబిస్తుందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు విడుదల చేసి గ్రామ పంచాయతీ సిబ్బందికి వేతనాలు ఇవ్వాలని, లేదంటే రానున్న వర్షం కాలం సీజన్ లో గ్రామ పంచాయతీ సిబ్బంది మరో మారు ఆందోళన బాట పట్టక తప్పదని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ కార్మికులకు మల్టిపర్పస్ విధానాన్ని రద్దు చేసి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని,ఉద్యోగ భద్రత కల్పించాలని, గ్రామపంచాయతీ కార్మికులపై అధికారుల వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 51 సవరించాలని, ఎన్నికల సందర్భంగా గ్రామ పంచాయతీ కార్మికులకు ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలు తూచా తప్పకుండా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశం రాము, సిఐటియు జిల్లా నాయకులు ఎన్. రాములు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి పుష్పా, జిల్లా నాయకులు హరిష్, కిషన్ నాయక్ సుగ్రీవుడు,వెంకటేష్, దాసు, శ్రీను లక్ష్మయ్య, నాగన్న, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖ సామాజికవేత్త,డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు రెండో తనయుడు అభిలాష్ కుమారుడు కొమ్ము అథర్వ్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఈ మేరకు షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్యఅతిథిగా హాజరై చిన్నారిని మనసారా దీవించారు.

– షాద్ నగర్, జూన్ 12 (నిఘా న్యూస్)

భూగర్భ డ్రైనేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం

ఉప్పల్, జూన్ 12(నిఘా న్యూస్): ఉప్పల్ డివిజన్ లోని కాలనీలలో డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్టుగా కార్పొరేటర్ రజిత పేర్కొన్నారు. డివిజన్ లోని న్యూ శాంతి నగర్ హనుమాన్ టెంపుల్ నుండి ట్రంక్ లైన్ ను సిల్ట్ గ్రాబెర్ యంత్రం ద్వారా క్లీనింగ్ పనులు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పనులను కార్పొరేటర్ పరిశీలించారు.ట్రంక్ లైన్ లలో తలెత్తిన ఇబ్బందులతో డివిజన్‌లోని పలు కాలనీలలో భూగర్భ డ్రైనేజీ సమస్య ఏర్పడిందన్నారు. సిల్ట్ గ్రాబెర్, ట్రంక్ లైన్లను క్లియర్ చేయడంతో శాంతి నగర్, న్యూ శాంతి నగర్, సాయి బాబా కాలనీ, సత్యనగర్, తదితర కాలనీలలో డ్రైనేజీ సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్ –సి సెల్ అధ్యక్షులు లింగంపల్లి రామకృష్ణ, డివిజన్ జెనరల్ సక్రెటరీ తుమ్మల దేవి రెడ్డి,న్యూ విజయ్ పూరి కాలనీ, సాయిబాబా కాలనీ, న్యూ శాంతినగర్ కాలనీ వాసులు నాగిరెడ్డి, వెంకటేష్ సెట్, వర్కల మధన్ గౌడ్,నర్సింహ రెడ్డి, రత్నం, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, అలుగుల అనీల్ కుమార్,సురేష్ యాదవ్, సుబ్బా రెడ్డి, తుమ్మల రాజేందర్ రెడ్డి,అంజిరెడ్డి, సుమన్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాల అభివృద్ధికి చర్యలు

ఉప్పల్ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

చిలుకానగర్, జూన్ 12 (నిఘా న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతి యేడు నిర్వహించే బడి బాట కార్యక్రమంలో భాగంగా బుధవారం చిలుకా నగర్ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలందరికీ నాణ్యమైన విద్యను అందించడం లక్ష్యంగా పాఠ్య పుస్తకాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ బడి బాట కార్యక్రమం భాగంగా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విధంగా అందరూ కృషి చేయాలని, పాఠశాలలో మౌలిక సదుపాయాల గురించి, పాఠశాల అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి తప్పక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆదినారాయణ, వారి సిబ్బంది, బిఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జెర్సీ -డి మార్ట్ రోడ్డును బాగు చేయండి

ఉప్పల్ సిపిఎం కార్యదర్శి గుంటోజు

ఉప్పల్, జూన్ 12(నిఘా న్యూస్): ఉప్పల్ దేవేందర్ నగర్ కాలనీ జెర్సీ నుండి డీమార్ట్ రోడ్ వరకు రోడ్లు గుంతల మయమై వర్షపు నీరు నిలుస్తున్న పట్టించుకునే నాథుడు లేదని ఉప్పల్ డివిజన్ సిపిఎం పార్టీ కార్యదర్శి గుంటోజు బ్రహ్మచారి ఆరోపించారు. చిన్న వర్షానికి జలపాతం లాగా మారిన మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఈ రోడ్డున వెళ్లి వాహనదారులు ప్రజలు ప్రతినిత్యం నరకయాతన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పల్ నుండి రామంతపూర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లే నాగోల్ ప్రధాన రాదని పేర్కొన్నారు. వర్షం వస్తే చాలు ఆ రోడ్డుపై నీరు నిలిచిపోయి ఇబ్బందికరంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి సమయాల్లో ఆ రోడ్డున వచ్చే ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి జెర్సీ నుండి డీమార్ట్ వరకు గల రోడ్డును బాగు చేయాలని కోరారు.

అక్షర శిఖరానికి అశ్రు నివాళులు

పీలేరు, జూన్ 12 (నిఘా న్యూస్): రామోజీ గ్రూప్ సంస్థల అధినేత దివంగత రామోజీరావు సేవలు చిరస్మరణీయమని అన్నమయ్య జిల్లా, పీలేరు ప్రెస్ క్లబ్ సభ్యులు అన్నారు. పీలేరు ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నర్తనశాలలో రామోజీరావు స్మారక సమావేశం జరిగింది. ప్రెస్ క్లబ్ సభ్యులు ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ చెరుకూరి రామోజీ ఒక తెలుగు దినపత్రిక కు వ్యవస్థాపకుడు, ప్రధాన సంపాదకుడు, ప్రచురణ కర్త, మార్గదర్శి చిట్‌ఫండ్, ప్రియా ఫుడ్స్, కళాంజలి మొదలగు వ్యాపార సంస్థల అధినేత. చిన్నప్పటినుండే ఆయనకు విద్య మీద, విజ్ఞానంపై గొప్ప ఆసక్తి ఉండేది. ఈ ఆసక్తిని ఆయన జీవితాంతం కొనసాగించి, ఎన్నో విజయాలు సాధించారు. రామోజీరావు వ్యాపార రంగంలో ప్రవేశించి, ఎన్నో సంస్థలను స్థాపించి, వాటిని విజయవంతంగా నడిపించారు. సామాజిక సేవకుడు రామోజీరావు , ప్రజల కోసం అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. విద్య, ఆరోగ్యం, సామాజిక రంగాలలో ఆయన చేసిన కృషి అమోఘం. ఆయన ప్రపంచంలోనే అతిపెద్ద చలనచిత్ర నిర్మాణ సంస్థ రామోజీ ఫిలిం సిటీని హైదరాబాదులో నిర్మించారు. అనేక భారతీయ భాషా చలనచిత్రాలు రామోజీ ఫిలిం సిటీలో రూపుదిద్దుకున్నాయి.ఇలా భారతదేశం మొత్తాన్ని తన వైపుకు తిప్పుకున్నారు. రామోజీరావు నైపుణ్యాలు, పట్టుదల, కృషి అద్భుతమైనవి. ఆయన నాయకత్వం, సమర్థత మనందరికీ మార్గదర్శకం. రామోజీరావు అందరికీ ప్రేరణగా నిలిచారు. మనం ఆయన నుండి నేర్చుకోవాల్సిన ముఖ్యమైన విషయాలు కృషి,పట్టుదల, మనోబలం. రామోజీరావు స్మృతిని స్మరించుకుంటూ, మనం ఆయన మార్గదర్శకత్వాన్ని కొనసాగిద్దామని అన్నారు. అనంతరం ఇటీవల వైకుంట ప్రాప్తి చెందిన పాత్రికేయుడు గోపి మాతృమూర్తి గుండ్లూరు నారాయణమ్మ ఆత్మకు శాంతి కలగాలని పీలేరు ప్రెస్ క్లబ్ తరపున రెండు నిమిషాలు మౌనం పాటించారు. పై కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ సభ్యులు మల్లెల జాకీర్ హుస్సేన్, పఠాన్ జాకీర్, జానం గంగిరెడ్డి, మయూరినాథ్ శర్మ, నాగరాజు, రమణారెడ్డి,పూల లోకనాథం, మస్తాన్, రవి కిషోర్, తులసి కృష్ణ, రామాంజులు పుల లోకనాథం గుండ్లూరు గోపి తిరుమలయ్య, హరీష్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలతోనే సమస్యల పరిష్కారం

సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)
CPI(M)
రాజకీయ శిక్షణా తరగతులు

వైరా, జూన్ 12 (నిఘా న్యూస్): ప్రజా సమస్యల పరిష్కారానికి రాబోయే కాలంలో ప్రతి సభ్యుడు ఒక సైనికుడిలా పని చేయాలని సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు అన్నారు. సిపిఎం పార్టీ వైరా పట్టణ సభ్యుల రాజకీయ శిక్షణా తరగతులు స్థానిక మదు విద్యాలయంలో రెండవ రోజు జరిగినవి. ఈ రాజకీయ తరగతులకు పార్టీ వైరా పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు చింతనిప్పు చలపతిరావు ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. బుధవారం పార్టీ నిర్మాణం క్లాసును పార్టీ జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు బోధిస్తూ నూతనంగా ఏర్పడిన ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే ప్రజలను కూడగట్టి ప్రజా ఉద్యమాలు బలోపేతం చేయాలని అన్నారు. అధికారమే లక్ష్యంగా ప్రజలను అనేక భ్రమలు కల్పించి, ప్రలోభాలకు లోనుచేసి ప్రజలను మోసం చేయాలనీ చూస్తే ఉపేక్షించేది లేదని అన్నారు. ప్రతి సభ్యుడు ప్రజా సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం ప్రజల్లో ఉండి పని చేయాలని కోరారు. నూతన ఆర్థిక విధానాలు క్లాస్ పార్టీ జిల్లా కమిటీ సభ్యులు చలమల విఠల్ బోధించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, వైరా పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, రూరల్ కార్యదర్శి తోట నాగేశ్వరావు, పట్టణ నాయకులు బోడపట్ల రవీందర్, మల్లెంపాటి రామారావు, బొంతు సమత, హరి వెంకటేశ్వరరావు, కొంగర సుధాకర్, గుడిమెట్ల రజిత, అనుమోలు రామారావు, రాచబంటి బత్తీరన్న, గుడిమెట్ల మోహన్ రావు, గుమ్మా నర్సింహారావు, సంక్రాంతి నరసయ్య, బెజవాడ వీరభద్రం, సంక్రాంతి పురుషోత్తం, తోట కృష్ణవేణి, మాడపాటి రామారావు, పారుపల్లి చంద్రశేఖర్ బాబు, షేక్ జమాల్ సాహెబ్, కురుగుంట్ల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన ఫలితాలు

జిల్లా ప్రజాపరిషత్ సెకండరీ పాఠశాల సింగరాజుపల్లి

దేవరుప్పుల జూన్ 12 (నిఘా న్యూస్) దేవరుప్పుల మండలంలోని సింగరాజుపల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులను ఓయూ జెఏసి వ్యవస్థాపక సభ్యుడు ఇప్ప పృథ్వి రెడ్డి అభినందించాడు. గత సంవత్సరం పదవ తరగతిలో 9.8 పాయింట్స్ సాధించి పాఠశాలలో టాపర్ గా నిలిచిన జోగు కావ్య, 9.7 పాయింట్స్ సాధించి రెండవ స్థానంలో నిలిచిన బెల్దె సాహితి, బేతి వైష్ణవిలకు ఈ సందర్భంగా అయన 10 వేల బహుమానం అందించారు. పృథ్వి రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు చదువు రాదు అనుకునే వారికి ఈ ఫలితాలే సమాధానమని, ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అయన అభినందించారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో మాత్రమే అర్హత కలిగిన ఉన్నత విద్యావంతులయిన ఉపాధ్యాయులు, ఇన్ఫ్రాస్ట్రక్చర్, మెరుగయిన వసతులు ఉన్నాయన్నారని, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రాగానే పాఠశాల్లో మౌలిక వసతుల కల్పనకు 600 కోట్ల రూపాయలు కేటాయించిందని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్యను అందించడానికి కంప్యూటర్ ల్యాబులతో పాటు, తరగతి గదుల్లో డిజిటల్ బోర్డులను ఏర్పాటు చేసి ప్రైవేటు పాఠశాలలను తలదన్నే రీతిలో తీర్చి దిద్దిందని,ప్రైవేట్ విద్యాసంస్థల్లో నడుస్తున్నదని, విద్యా వ్యాపారం అని వేలల్లో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తూ సామాన్య ప్రజలకు విద్యను దూరం చేయాలనే కుట్ర చేస్తున్నారని, మెరుగైన భవిష్యత్తు కోసం విద్యార్థులు ఉన్నత చదువులు చదవడంతో పాటు, సామాజిక వ్యవస్థలను ప్రక్షాళన చేయడానికి విద్యార్థులు ముందు వరుసలో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ జీ. కళావతి, ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లితండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.

మ్యాన్ హెూళ్లపై సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు

- మ్యాన్ హెూల్ మూతలను తెరవరాదు
- జలమండలి అంబర్ పేట్ సబ్ డివిజన్ ఏడిఈ విష్ణువర్ధన్ రావు

అంబర్‌పేట్, జూన్ 12(నిఘా న్యూస్): వర్షాకాల ప్రణాళికలో భాగంగా జలమండలి ఇప్పటికే అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని ఆ శాఖ అంబర్ పేట్ (అడిక్ మెట్) సబ్ డివిజన్ ఏడిఈ విష్ణువర్ధన్ రావు తెలిపారు. బుధవారం ఆయన నిఘా న్యూస్ తో మాట్లాడుతూ వర్షాకాలం ఎలాంటి ప్రమాదాలు జరగకుండా డివిజన్ పరిధిలోని అన్ని మ్యాన్ హెూళ్లపై సేఫ్టీ గ్రిల్స్ బిగించడం జరిగిందన్నారు. ప్రధాన రహదారుల్లో ఉన్న మ్యాన్ హెూళ్లపై కవర్స్ ను ఏర్పాటు చేసి వాటికి సీల్ చేసి, రెడ్ పెయింట్ వేయించినట్లు తెలిపారు. వర్షాకాలం సందర్భంగా డివిజన్ అధికారులు సిబ్బంది తో పాటు ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (ఈఆర్టీ), సేఫ్టీ ప్రోటోకాల్ టీమ్ (ఎస్పీటీ) వాహనాలు 24 గంటలపాటు అందుబాటులో ఉంటాయన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే సిబ్బందికి రక్షణ పరికరాలను అందించామని, ఈ బృందాలకు తమకు కేటాయించిన వాహనాల్లో జనరేటర్ తో కూడిన డీ వాటర్ మోటార్ తో అందుబాటులో ఉంటారన్నారు. వీటి సహాయంతో సిబ్బంది వర్షపు నీటిని తొలగిస్తారని, ఆయా ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండి పనిచేస్తారని పేర్కొన్నారు. వర్షాకాలం భారీగా నీరు చేరే ప్రాంతాలపై ఈ బృందాలు ప్రధానంగా దృష్టి సారిస్తాయని, వీటితో పాటు ఎయిర్ టెక్ మిషన్లు సైతం అందుబాటులో ఉంటాయన్నారు. మ్యాన్ హెూళ్ల నుంచి తీసిన వ్యర్థాలు (సిల్ట్) ని ఎప్పటికప్పుడు తొలగించడం జరుగుతుందన్నారు. మ్యాన్ హెూళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడానికి ప్రతి సెక్షన్ నుంచి సీవర్ ఇన్స్పెక్టర్ నేతృత్వంలో ఒక సీవరేజీ బృందం ఏర్పాటు చేశామని, వీరు ఉదయాన్నే క్షేత్ర స్థాయిలో వారి పరిధిలోని ప్రాంతాలకు వెళ్లి పరిస్థితి పర్యవేక్షిస్తారని డీజీఎం చెప్పారు. చోకేజీ, వాటర్ లాగింగ్ పాయింట్లను జీహెచ్ఎంసీ అధికారుల సమన్వయంతో ఎప్పటి కప్పుడు క్లియర్ చేయనున్నట్లు వెల్లడించారు. ఎక్కడైనా మ్యాన్ హెూల్ మూత ధ్వంసమైనా, తెరిచి ఉంచినట్లు గమనించినా లేదా ఇతర సమస్యలు, ఫిర్యాదులుంటే ప్రజలు జలమండలి కస్టమర్ కేర్ నంబరు 155313కి ఫోన్ చేసి లేదా స్థానిక జలమండలి కార్యాలయానికి సమాచారం ఇవ్వాలని ఆయన సూచించారు. వర్షాకాలం ఎట్టి పరిస్థితుల్లోనూ రహదారులు, ఇతర ప్రాంతాల్లో ఉన్న మ్యాన్ హెూళ్ల మూతలు తెరవరాదని, తెరిస్తే కఠిన చర్యలుంటాయని ఆయన తెలిపారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి

హబ్సిగూడ కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ, జూన్ 12(నిఘా న్యూస్): రోడ్డు నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని హబ్సిగూడ కార్పొరేటర్ కక్కిరేణి చేతన హరీష్ అధికారులకు, కాంట్రాక్టర్ కు సూచించారు. బుధవారం డివిజన్ లోని కామాక్షిపురం స్ట్రీట్ నెంబర్ 2 లో సుమారు రూ.34 లక్షలతో నిధులతో వ్యయంతో నిర్మిస్తున్న రోడ్డు పనులను కార్పొరేటర్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. రోడ్డు వేసిన అనంతరం క్యూరింగ్ సక్రమంగా జరిగేలా దగ్గరుండి అధికారులు పర్యవేక్షించాలని సూచించారు.గతంలో కామాక్షిపురంలో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉండేదని అనుగుణంగా డ్రైనేజీ పైపులు పెద్దది వేయడం జరిగిందని తెలిపారు. అనంతరం సిసి రోడ్డు వేయడం జరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏ.ఈ. సాయికిరణ్, స్థానికులు రవి ,కల్లుకల లింగం, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

నిర్మల్ జిల్లా ముధోల్ జూన్ 12 (నిఘా న్యూస్) మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే రామారావు పటేల్ ఆర్ డబ్ల్యు ఎస్ పంచాయత్ రాజ్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ప్రజలకు తాగునీటి సమస్య, రోడ్లు, ఇతరత్ర సమస్యలు ఏర్పడకుండా చూడాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

మౌలాలి, జూన్ 12(నిఘా న్యూస్): తెలంగాణ ప్రభుత్వం ప్రతి యేడు నిర్వహించే బడి బాట కార్యక్రమంలో భాగంగా మీర్పేట్ హెచ్ బీ కాలనీ డివిజన్ తిరుమల నగర్ ప్రభుత్వ పాఠశాలలో పిల్లలందరికీ నాణ్యమైన పాఠ్యపుస్తకాలను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ గుండారపు శ్రీనివాస్ రెడ్డి లతో కలిసి పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా ఉపాధ్యాయులు తమ వంతు కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ ఉపాధ్యాయులు, స్థానిక నాయకులు మల్లేష్ గౌడ్ నరసింహా శేఖర్ గౌడ్, నిసార్ అహ్మద్ గోరి తదితరులు పాల్గొన్నారు.

వీరారెడ్డి నగర్‌లో కార్పొరేటర్ పర్యటన

నాచారం, జూన్ 12 (నిఘా న్యూస్): నాచారం డివిజన్ వీరారెడ్డి నగర్ కాలనీలో స్థానిక వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపుమేరకు కార్పొరేటర్ అధికారులతో కలిసి కాలనీలో పర్యటించారు. ప్రధానంగా వీరారెడ్డి నగర్ కాలనీలో చిన్న వర్షం వచ్చిన రోడ్లపై నీళ్లు గంటల తరబడి నిలిచి ఉంటున్నాయి. కాబట్టి ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఇదివరకే ఈ సమస్య పరిష్కరించడానికి వర్షపు నీటి డ్రైన్ వేయడం జరిగింది అలాగే సిసి రోడ్డు కూడా వేయడం జరిగింది. అయినను సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోవడంతో బుధవారం కార్పొరేటర్ శాంతి ఇంకొక వర్షపు నీటి ట్రంక్ లైను వేయిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రేటర్ నాయకులు సాయి జన్ శేఖర్ మేకల ముత్యంరెడ్డి ,శివకుమార్, గంగాధర్, కాలనీవాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు, వర్క్ ఇన్స్పెక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పాఠ్యపుస్తకాల పంపిణీ

పహాడీషరీఫ్ జూన్ 12(నిఘా న్యూస్) మహేశ్వరం మోడల్ స్కూల్ లో పాఠశాల పునః ప్రారంభ దినోత్సవం పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఉచితంగా యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు , నోట్ బుక్స్ అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ మునగాల లత చారి పంపిణీ చేశారు. విద్యార్థులను ఉద్దేశించి చైర్మన్ మునగాల లత మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని మంచిగా చదువుకొని పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలని ఆకాంక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు

లంచాల జోలె పట్టిన ఉప్పల్ ఎంఈఓ..?

- పాఠశాలల్లో విచ్చలవిడిగా పుస్తకాల వ్యాపారం
- మాస్టర్ మైండ్స్ పాఠశాల క్రిమినల్ బుద్ధి
- సీజ్ చేసిన పాఠశాలలో అడ్మిషన్లు ప్రారంభం
- మాస్టర్ మైండ్స్ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి

ఉప్పల్ జూన్ 12 (నిఘా న్యూస్): విద్యాశాఖ అధికారులు సీజ్ చేసిన పాఠశాలలో తిరిగి అడ్మిషన్లు నిర్వహిస్తున్న మాస్టర్ మైండ్స్ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉప్పల్ హనుమసాయి నగర్ లో అనధికారికంగా ఏర్పాటు చేసిన ది మాస్టర్ మైండ్స్ పాఠశాలను ఉప్పల్ మండల విద్యాశాఖ అధికారులు క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్పీ) స్వప్న సీజ్ చేసిన సంగతి విధితమే, కానీ సీజ్ చేసిన ప్రిన్సిపాల్ గదిని అక్రమంగా సదరు పాఠశాల యాజమాన్యం సీజ్ ను తొలగించి, అక్రమంగా అడ్మిషన్లు నిర్వహించడం చట్ట విరుద్ధమని వారు అన్నారు. తక్షణమే విద్యాశాకాధికారులు మాస్టర్ మైండ్స్ పాఠశాలపై చీటింగ్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ నిబంధనలకు పాతర వేస్తున్నారని, చట్టాన్ని, నిబంధనలను తమ చేతుల్లోకి తీసుకుని వికృత వ్యాపార పోకడలను అనుసరిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. విద్యాశాఖ నిబంధనలనే పాటించని సదరు మాస్టర్ మైండ్స్ యాజమాన్యం, విద్యార్థుల భవిష్యత్ ను ఏరకంగా తీర్చిదిద్దుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారుల మొద్దు నిద్ర కారణంగానే పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని వారు ధ్వజమెత్తారు. కాసుల కక్కుర్తితో విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టి వేయకుండా తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు మాస్టర్ మైండ్స్ పాఠశాలపై కేసు నమోదు చేయాలని లేని పక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. కాగా ఉప్పల్ మండలం పరిధిలోని ప్రైవేట్ పాఠశాలల్లో విద్య వ్యాపారం విచ్చలవిడిగా కొనసాగుతుందని స్థానికులు ఆరోపించారు. ఏ ఒక్క పాఠశాలలో నువ్వు నిబంధనలు పాటించడం లేదని దీనికంతటికి ఎంఈఓ అవినీతే కారణమని వారు ఆరోపించారు.

సమస్యలతో ప్రారంభమైన విద్యా సంవత్సరం

- ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- ఒకే జత యూనిఫామ్ మాత్రమే పంపిణీకి సిద్ధం
- 70 శాతం మంది విద్యార్థులకు మాత్రమే కొత్త పాఠ్యపుస్తకాలు
- మిగతా 30 శాతం మంది విద్యార్థులకు పాత పుస్తకాలే శరణ్యమా
- విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

వనపర్తి, జూన్ 12(నిఘా న్యూస్): సమస్యలతో ప్రారంభమైన విద్యా సంవత్సరం ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని సిపిఐ వనపర్తి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీరామ్ రమేష్ గోపాలకృష్ణలు అన్నారు.వనపర్తి జిల్లాలో పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ విజయ లక్ష్మికి బుధవారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, ఉపాధ్యాయులు లేక పోవడంతో పాఠశాలలకు వెళ్లిన విద్యార్థులకు పాఠాలు ఎవరు బోధించాలని వారు ప్రశ్నించారు. జిల్లా అధికార యంత్రాంగం ఆగ మేఘాల మీద యూనిఫామ్ ను సరఫరా చేసి కుట్టించారని, అది కూడా ఒక జత మాత్రమే అందుబాటులో ఉందని, రెండో జతను తక్షణమే తెప్పించి కుట్టించి విద్యార్థులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ విద్యా సంవత్సరం కూడా పాఠ్య పుస్తకాలు 70శాతం మంది విద్యార్థులకు మాత్రమే అందుబాటులో ఉండే విధంగా ఉన్నాయని, మిగతా 30శాతం విద్యార్థులకు పాత పాఠ్యపుస్తకాలను అందించే ప్రయత్నం చేస్తున్నారని ఇది తగదని వారు విమర్శించారు. తక్షణమే కొత్త పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు అందరికీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. మన ఊరు-మనబడి పేరుతో కనీస మౌలిక వసతులను కల్పించాలన్న ఉద్దేశంతో జరుగుతున్న పనులు నాసిరకంగా నత్తనడకగా సాగుతున్నాయని, వెంటనే నాణ్యమైన పనులను, మరమ్మత్తులను త్వరగా పూర్తి చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని, అధికంగా ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, ప్రవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ యూనిఫామ్, బెల్ట్,షూ, టై లాంటి వస్తువులను అమ్ముతున్న పాఠశాలల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేసి వారి గుర్తింపును రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనుమతులు లేని పాఠశాలలను రద్దు చేయాలని, ఇటీవల కాలంలో కొత్తగా రెండు కార్పొరేట్ ప్రైవేటు పాఠశాలలు అనుమతి లేకుండా అడ్మిషన్లు గత మూడు నెలల నుంచి చేర్పిస్తున్నారని ఆరోపించారు. వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, విద్య హక్కు చట్ట ప్రకారం ప్రతి ప్రవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లను ఉచితంగా ఇవ్వాలన్న నిబంధనలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిట్నెస్ లేని ప్రైవేట్ స్కూల్ బస్సులను తనిఖీ చేసి సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు లక్ష్మీ నారాయణ, మైబూస్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలకు... మిషన్ భగీరథ పనులపై నిరసన

- సర్వే పనుల నుండి అంగన్ వాడి టీచర్లను మినయించాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి గోపాల్ స్వామి డిమాండ్

సిద్దిపేట, జూన్ 12 (నిఘా న్యూస్): అంగన్ వాడి టీచర్లకు ఇప్పటికే తలకు మించిన పని భారం ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా మిషన్ భగీరథ సర్వేల చేపట్టాలని వెలుపర్చిన ఆదేశాలను వెనకకు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండల పరిధిలోని దుద్దెడ గ్రామ శివారులో ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా లో మిషన్ భగీరథ సర్వేను అంగన్ వాడి టీచర్లు చేయాలని అధికారులు ట్రైనింగ్ ఇస్తూ సూచించారు. సమయంలోనే అంగన్ వాడి టీచర్లు అక్కడ ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.యూనియన్ ఆధ్వర్యంలో ఇది చేయలేమని తేల్చి చెప్పినప్పటికీ తప్పని సరిగా చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని దీన్ని విరమించు కోవాలని ఆయన సూచించారు. ఐసిడిఎస్ శాఖలో ఉన్న అనేక పనులను అంతర్ జాలం ద్వారా వివిధ సర్వే పనులతో తలకు మించిన భారం అవుతుంది. కొత్తగా మిషన్ భగీరథ సర్వేలు చేయాలని ప్రభుత్వ అధికారులు వత్తిళ్లు చేయడం మానుకోవాలని అన్నారు. 2024విద్యా సంవత్సరం ప్రారంభ అవుతున్న సమయంలో శిశువుల నుండి ఐదు సంవత్సరాల పిల్లల వరకు వారి సంరక్షణతో పాటు వారి పోషక పదార్థాలు అందించే దాంట్లో గర్భవతులకు పోషక పదార్థాలు అందించే దాంట్లో అంగన్ వాడి టీచర్లువిధుల్లో తిరికాలేకుండా ఉంటున్న సమయంలో ఇలాంటి సర్వేలు చేయాలని ఒత్తులు చేయడం సబబు కాదని అన్నారు. నూతన విద్య సంవత్సరం ప్రారంభదిశలో అంగన్ వాడి టీచర్ల విధులకు ఆటంకం కలుగుతుంది, గ్రామ ప్రజలతో ఇబ్బందులు వస్తాయి, ఐసిడిఎస్ పరిరక్షణకు పిల్లల పోషణకు గర్భవతులకు అన్ని రకాల సేవలను చేస్తున్నటువంటి అంగన్వాడీ టీచర్లను మరోమారు మిషన్ భగీరథ సర్వేలు చేయాలని చెప్పడాన్ని వారు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి జి. భాస్కర్ సిఐటియు జిల్లా సహయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం పద్మ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీ కోశాధికారి పద్మ, అంగన్ వాడి యూనియన్ నాయకులు ఎల్ల లక్ష్మీ, వసంత,అనిత, శ్యామల, శబరి, సురేఖ, భూలక్ష్మి, ప్రేమలత కళావతి, టీచర్లు పాల్గొన్నారు

నెక్నాపూర్ చెరువులో ప్రభుత్వ బోర్డు

నెక్నా పూర్ చెరువు పూడిక తీత పనులు చేపట్టేది ఎప్పుడు..?

గండిపేట, జూన్ 12(నిఘా న్యూస్): ప్రభుత్వ భూములు చెరువులు అన్యాక్రాంతం అవకుండా ఎప్పటికప్పుడు రెవిన్యూ అధికారులు సిబ్బంది పర్యవేక్షణ జరుపుతున్నారని గండిపేట మండలం తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మణికొండ మున్సిపల్ పరిధిలోని నెక్నాపూర్ సర్వే నంబర్ 336లో ఉన్న కోట్ల రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని కొందరు గద్దలు కబ్జా చేసేందుకు మట్టిని పోసి చదును చేశారు.రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు అందడంతో ఘటనా స్థలానికి చేరుకుని ఈ భూమి ప్రభుత్వానికి సంబంధించినదిగా పేర్కొంటూ ప్రభుత్వ సూచిక బోర్డును ఏర్పాటు చేశారు.

పూడిక తీత చేపట్టాలి మున్సిపల్ ప్రజలు

వర్షాకాలం మొదలైందని కానీ నెక్నాపూర్ చెరువు పూడిక తీత పనులు మాత్రం చేపట్టలేదని మున్సిపల్ ప్రజలు అన్నారు. ఇప్పటికైనా పెద్ద చెరువు చిన్న చెరువుల చుట్టూ కంచెను ఏర్పాటు చేసి పూడిక తీత పనులు చేపట్టి అభివృద్ధి పరచి చిన్నారులకు వృద్దులకు ప్రజలకు సేద తీరేందుకు ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించి పచ్చదనాన్ని పెంపొందించాలని పాలకవర్గాన్ని అధికారులను స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేశారు.కంచె లేకపోవడంతో కబ్జా రాయుళ్లు రెచ్చిపోయి చెరువును కబ్జా చేసేందును ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

రెండు వేల గజాల పార్కు స్థలానికి ఎసరు..!

- చోద్యం చూస్తున్న మేయర్ జక్క వెంకట్ రెడ్డి..?
- పార్కు స్థలంలో మున్సిపల్ అధికారుల అనుమతులు
- నిరసనల హోరుతో పొరపాటు జరిగిందని అనుమతుల రద్దు
- కోర్టు మెట్లు ఎక్కిన కబ్జాదారులు
- పార్కు స్థలాన్ని కాపాడాలని కమిషనర్ కు వినతి పత్రం

మేడిపల్లి, జూన్ 12 (నిఘా న్యూస్): పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సాయిప్రియనగర్, రోడ్ నెంబర్ 2 లో రెండు వేల గజాల పార్క్ స్థలాన్ని కబ్జాదారుల నుండి కాపాడాలంటూ కాలనీవాసులు పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ సాయి ప్రియ నగర్, సాలార్ జాంగ్ కంచ, పర్వతాపూర్, సాయి ప్రియ నగర్, రోడ్ నెంబర్ 2 లో రెండు వేల గజాల పార్క్ స్థలాన్ని కొందరు కబ్జా దారులు నిర్మాణాలు చేయడానికి ప్రయత్నించారు. వారికి మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పొరపాటున ఇచ్చిన పర్మిషన్ ను అప్పటి కమిషనర్ రద్దు చేయడం జరిగింది. దీనిపై కబ్జా దారులు కోర్టును ఆశ్రయించారు. కోర్టులో కబ్జాదారులకు మున్సిపల్ అధికారులు కౌంటర్ వేయలేదని తెలిసిందన్నారు. పార్క్ ప్రక్కన ఉన్న 359 ప్లాట్ నెంబర్ సీసీ, ఈసీ, కాపీ తీయగా సరిహద్దు మాత్రం ఓపెన్ ఏరియా అని వ్రాసి ఉన్నది. లేఔట్ లో కూడా పార్కు స్థలమని క్లియర్ గా మెన్షన్ చేసి ఉన్నది. గతంలో ఉన్న కమిషనర్ పార్క్ ప్లేసులో బోర్డు కూడా నాటించడం జరిగింది. మున్సిపల్ అధికారుల వల్ల పార్కుకు ముప్పు పొంచి ఉందని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. కబ్జాకోరు దారులకు మున్సిపల్ వారు సహకరించవద్దని, అలాగే ప్లాట్లుగా చేసి అమ్మినప్పుడు జిపిఏ దారులు బ్రోచర్ లో స్కూల్ భవనము, పార్కులు, మందిరములకు స్థలం వదిలేస్తూ బ్రోచర్ తయారు చేసి అమ్మడం జరిగిందన్నారు. అవన్నీ చూసే ప్లాట్ లని కొనుగోలు చేసుకున్నామన్నారు. బ్రోచర్ తో సహా సంబంధిత డాక్యుమెంట్ లు వినతి పత్రము తో పాటు జతచేస్తూ కమిషనర్ త్రిలేశ్వరరావుకు పార్కు స్థలాన్ని కాపాడాలంటూ కోరుతూ అందజేశారు. ఈ కార్యక్రమంలో నారగోని ప్రవీణ్ కుమార్, కమలాకర్, శ్రీనివాస్, లక్ష్మీ, ఊర్మిళ, జలంధర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమల చేరుకున్న చంద్రబాబు

రేణిగుంట విమానాశ్రయంలో ఘన స్వాగతం పలికిన నేతలు

రేణిగుంట, జూన్ 12 (నిఘా న్యూస్): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం అనంతరం మొట్ట మొదటి సారిగా తిరుపతి జిల్లాలో రెండు రోజుల పర్యటనలో భాగంగా రేణిగుంట విమానాశ్రయానికి బుధవారం రాత్రి 7.35 గం.లకు కుటుంబ సమేతంగా చేరుకున్న ముఖ్యమంత్రికి ఘన స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వెంట మంత్రి నారా లోకేష్ ఉన్నారు. ప్రిన్సిపల్ సెక్రటరీ ఎండోమెంట్స్ కరికాల వలనన్, డిఐజీ షిమోషి, తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లు ప్రవీణ్ కుమార్, షన్మోహన్,తిరుపతి ఎస్పి హర్ష వర్ధన్ రాజు,ఎమ్మెల్యే లు బొజ్జల సుధీర్ రెడ్డి, పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు, జెసి చిత్తూరు శ్రీనివాసులు, టీటీడీ జే ఈ ఓ గౌతమి, తిరుపతి మునిసిపల్ కమిషనర్ అదితి సింగ్ జిల్లా రెవెన్యూ అధికారి పెంచల కిషోర్ తదితరులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన వారిలో ఉన్నారు. అనంతరం ముఖ్యమంత్రి రాత్రి 07.55 గం.లకు రేణిగుంట విమానాశ్రయం నుండి రోడ్డు మార్గాన తిరుమలకు శ్రీవారి దర్శనార్థం బయల్దేరి వెళ్లారు. రేపు ఉదయం 7.30 గం.లకు తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా దర్శించు కోనున్నారు.

ఘనంగా సినారే వర్ధంతి వేడుకలు

హాజరైన ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

వేములవాడ, జూన్ 12 (నిఘా న్యూస్): వేములవాడ రూరల్ మండలం హన్మజీపేట గ్రామంలోని సుశీలా నారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో కవితా కర్పూర క్షేత్రంలో నిర్వహించిన మహాకవి జ్ఞానపిఠ పురస్కార గ్రహీత సింగిరెడ్డి నారాయణ రెడ్డి (సినారే) వర్ధంతి వేడుకల్లో ప్రభుత్వ విప్,వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ పాల్గొన్నారు. సినారె స్మృతి స్థలిపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.

పది రోజుల్లో మార్పు కనిపించాలి

నాణ్యత లోపించినా ఊరుకునేది లేదు

మున్నేరు ఆర్సీ వాల్స్ సందర్శనలో మంత్రి పొంగులేటి

ఖమ్మం, జూన్ 12(నిఘా న్యూస్): ఇప్పటికే నాలుగు నెలల ఆలస్యం అయింది ఆర్సీ వాల్స్ నిర్మాణ పనులను వేగవంతం చేయండి ఇందు కోసం ప్రతిభావంతులైన వర్కర్లను నియమించి పనుల్లో లోపాలు తలెత్తకుండా చూడండి పది రోజుల్లో మళ్లీ వస్తా పనుల్లో పురోభివృద్ధి లేకపోతే చర్యలు తప్పవు అని నాణ్యత లోపించినా ఊరుకునేది లేదంటూ తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణం,సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అధికారులతో పేర్కొన్నారు.దానవాయిగూడెంలో మున్నేరు ఆర్సీ వాల్స్ నిర్మాణ పనులను మంత్రి పొంగులేటి, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, ఆర్డీవో గణేష్ తో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ యుద్ధప్రాతిపదికన పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు.అవసరమైతే ఫుల్ టైం నిర్మాణ పనులను చేపట్టి త్వరగా పూర్తి చేయాలన్నారు.రెవెన్యూ అధికారులు మున్నేరుకు ఇరువైపులా ఉన్న ప్రభత్వ భూములను గుర్తించి ఇరిగేషన్ అధికారులకు అప్పగించాలని సూచించారు. గోళ్లపాడు సైడ్ డ్రైన్ల మాదిరిగా మున్నేరు సైడ్ డ్రైన్ లను నిర్మించాలని ఆదేశించారు. స్టార్టింగ్ పాయింట్ ఎండింగ్ పాయింట్ లను గుర్తించి సైడ్ డ్రైన్ ల నిర్మాణ పనులను చేపట్టాలని, తద్వారా మురికి నీరు మున్నేరులో చేరకుండా ఉంటుందని తెలిపారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, రామ్మూర్తి నాయక్, రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కళ్లెం వెంకట్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వందనం లిఫ్ట్ ఇరిగేషన్‌కు రూ.25 కోట్లు మంజూరు

- ఇల్లు లేని పేదలకు త్వరలో ఇందిరమ్మ ఇండ్లు
- రూ.4 కోట్లతో వందనం గ్రామంలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సీఎం భట్టి
- వారంలో రెండు రోజులు నియోజకవర్గంలో పర్యటన

ఖమ్మం/చింతకాని, జూన్ 12(నిఘా న్యూస్): ప్రతినిమిషాన్ని సద్వినియోగం చేసుకుని మధిర నియోజకవర్గంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. బుధవారం మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలం వందనం గ్రామంలో నాలుగు కోట్ల రూపాయలతో వందనం- పుట్టకోట గ్రామాల మధ్యన బీటీ రోడ్డు నిర్మాణానికి వందనం గ్రామం వద్ద శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడారు. చింతకాని మండలం రైతుల సాగునీటి సమస్యను పరిష్కరించడానికి 25 కోట్ల రూపాయలతో కోధుమూరు- వందనం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును మంజూరు చేసినట్లు తెలిపారు. ఎన్ఎస్పిఎల్ నీళ్ల ద్వారా రైతుల పొలాల్లో ఈ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మ పరవళ్ళు తొక్కుతుందని వెల్లడించారు. ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు త్వరలోనే టెండర్లు పిలువనున్నట్లు వెల్లడించారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని చెప్పారు.వారంలో రెండు రోజులు మదిర నియోజకవర్గంలో పర్యటన చేసి అభివృద్ధి పనులను పరుగులు పెట్టిస్తామని చెప్పారు. మిగతా ఐదు రోజులు మధిర శాసనసభ్యుడిగా డిప్యూటీ సీఎంగా రాష్ట్ర పాలనలో భాగస్వామ్యం అవుతూ మిగత జిల్లాల్లో పర్యటిస్తూ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిలో భాగస్వామిని అవుతానని చెప్పారు.రోడ్డు పనులకు శంకుస్థాపన రూ. 2కోట్ల 70 లక్షలతో చింతకాని మండలం రేపల్లెవాడ నుంచి ఎన్ఎస్పి కెనాల్,రూ. 5 కోట్ల 60లక్షలతో రేపల్లెవాడ నుంచి నేరడ, ఆరు కోట్ల రూపాయలతో పాతర్లపాడు నుండి గోవిందపురం వరకు బిటి రోడ్డు పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. నిర్దేశిత గడువులోగా ఈ పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు.

పాఠశాలల బస్సులపై అధికారుల కొరడా

ఫిట్‌నెస్ లేని వాహనాల సీజ్

రాజేంద్రనగర్, జూన్ 12 (నిఘా న్యూస్): కళాశాలలు పాఠశాలలు పూనమ్ ప్రారంభం కావడంతో రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు.విద్యా సంస్థల బస్సులపై ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు.ఫిట్‌నెస్ లేని, పన్నులు చెల్లించని బస్సులపై అలాగే డ్రైవింగ్ లైసెన్స్ లేని డ్రైవర్ లపై కేసులు నమోదు చేయడం జరిగిందని అధికారులు తెలిపారు. రాజేంద్రనగర్‌లో స్కూల్ బస్సులపై కొరడా ఝుళిపించారు. పాఠశాలల పునప్రారంభం కావడంతో విద్యార్థులను తలరించే స్కూల్ బస్సులపై ప్రత్యేక నిఘా పెంచి తనిఖీలు చేస్తున్నామన్నారు. రాజేంద్రనగర్, శంషాబాద్, మొయినాబాద్, శేరిలింగంపల్లితో పాటు పలు చోట్ల విస్తృత తనిఖీలు నిర్వహించడం జరిగిందని తెలిపారు. ప్రతి బస్సులను క్షుణంగా తనిఖీలు నిర్వహించి పరిశీలిస్తున్నామన్నారు. స్కూల్ బస్సులో ఆర్సీ, పర్మిట్,ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్,పొల్యూషన్, ఫైర్ ఎక్స్‌టెన్గిషర్,ఫస్ట్ ఎయిడ్ కిట్‌తో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లు ఉండాలన్నారు.ఫిట్‌నెస్ లేని,15 సంవత్సరాలు దాటిన విద్యా సంస్థల బస్సులు ఎట్టి పరిస్థితులలో రోడ్డుపైకి తిప్పిరాదని తెలిపారు. అనుభవం గల,60 సంవత్సరాలు మించని డ్రైవర్లను నియమించు కోవాలని సూచించారు.ప్రతి విద్యా సంస్థ బస్సు తప్పనిసరిగా సంబంధిత రవాణా శాఖ కార్యాలయంలో పిట్‌నెస్ సర్టిఫికెట్ పొందాలని తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా బస్సులను రోడ్డుపై నడిపిన బస్సులను సీజ్ చేయడం జరుగు తుందన్నారు.

వైద్యులపై చర్యలు తప్పవు

భైంసా, జూన్ 12 (నిఘా న్యూస్): ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని బుధవారం ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ సందర్శించారు. ఆసుపత్రికి వచ్చిన గర్భిణులతో మాట్లాడి వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. రోగులకు వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆయన అన్నారు. ఎల్లవేలలా వైద్యులు రోగుల సేవ నిమిత్తం అందుబాటులో ఉండాలని సూచించారు.

Printed Published by Ch.Srinivas, Printed at M/s Apsara Printing Works, H.No. G9 Ground Floor, Maruti Complex, Nagole Cross Road, Hyderabad, Telangana India - 500068.
Editor : Ch.Srinivas RNI Reg.No.APTEL/2010/35098. Phone: +91 90142 77465 email: nighareporters@gmail.com